ప్రజాశక్తి

శనివారం 20 సెప్టెంబర్ 2025

8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

బల్క్ డ్రగ్‌పై ఉధృత పోరాటం



మత్స్యకారుల పోరాటానికి మద్దతు తెలుపుతున్న వి.శ్రీనివాసరావు

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- రాజయ్యపేటలో మత్స్యకారుల దీక్షకు మద్దతు

ప్రజాశక్తి - నక్కపల్లి : ప్రజల జీవితాలను, పర్యావరణాన్ని నాశనం చేసే బల్క్ డ్రగ్ పార్కు రద్దయ్యే వరకూ పోరాటం నిర్వహించాలని మత్స్యకారులకు, బాధిత ప్రజలకు సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. నక్కపల్లి మండలంలో మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు తలపెట్టిన రిలే నిరాహార దీక్షలు శుక్రవారానికి ఆరో రోజుకు చేరుకున్నాయి. దీక్షా శిబిరాన్ని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం సందర్శించి మద్దతు ప్రకటించారు. తొలుత వారికి సంప్రదాయ పద్ధతిలో మత్స్యకారులు స్వాగతం పలికారు. తలపై ధరించే సవతన (టోపీ), కత్తవా (తెడ్డి), వల, బుట్టలను అందజేశారు. అనంతరం మత్స్యకార నాయకులు పలు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వి.శ్రీనివాసరావు మాట్లాడుతూ రాష్ట్ర హోం శాఖ మంత్రి అనిత నియోజకవర్గంలో మత్స్యకారులు బల్క్ డ్రగ్స్ పార్క్ ఏర్పాటు చేయొద్దని ఆరు రోజులుగా నిరాహార దీక్షలు చేస్తుంటే ఆమె ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. అధికారంలోకి రాగానే ప్రతి పక్షంలో చెప్పిన మాటలు, ఇచ్చిన హామీలను తుంగలో తొక్కి మత్స్యకారుల జీవితాలను నాశనం చేస్తారా ? అని ప్రశ్నించారు. బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటుకు రాష్ట్రంలో ప్రజలు ఎక్కడా అంగీకరించలేదని, అటువంటిది ఇక్కడ ఎలా ఏర్పాటు చేస్తారని వి.శ్రీనివాసరావు అడిగారు. ఇక్కడ మత్స్యకారులు జీవించాల్సిన అవసరం లేదా ? అని ప్రశ్నించారు. బల్క్ డ్రగ్ పార్క్ ఏర్పాటుకు మండలంలో ముందుగా ఐదు వేల ఎకరాల భూసేకరణ చేపట్టారని, 1700 ఎకరాలు సరిపోతుందని, ఈ నేపథ్యంలో అంత ఎక్కువ భూమి ఎందుకు సేకరించారని అడిగారు. సేకరించిన భూమిని మిట్టల్ స్టీల్‌ప్లాంట్‌కు కేటాయించారని, మరలా ఇప్పుడు బల్క్ డ్రగ్ మిగతా 2లో..

బడుగులపై ప్రతాపం



ఫుడ్ కోర్టులో బడ్డీల తొలగింపు, నిరసన దృశ్యాలు

- ఆక్రమణల పేరిట దుకాణాలు, బండ్లు తొలగింపు
- కన్నీరుమున్నీరవుతున్న చిరువ్యాపారులు
- జివిఎంసి తీరుపై విమర్శలు

నగరంలోని చిరువ్యాపారుల దుకాణాలను, తోపుడుబండ్లను జివిఎంసి అధికారులు రెండో రోజైన శుక్రవారమూ తొలగించారు. రెక్కాడితేగానీ డొక్కాడని బతుకులపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడ్డారు. తమ పొట్టకొట్టొద్దని చిరువ్యాపారులు, వీధి విక్రయదారులు కన్నీరుమున్నీరై అధికారులను ప్రాధేయపడినా వారు వినిపించుకోలేదు. తొలగింపులను అక్కడక్కడా చిరు వ్యాపారులు అడ్డుకోవాలని ప్రయత్నించినా పోలీసుల సాయంతో వారిని పక్కకు ఈడ్చివేస్తూ కూటమి సర్కారు తన అసలు నైజాన్ని ప్రదర్శించింది. ప్రభుత్వ, జివిఎంసి తీరుపై నగరంలో విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. (వార్తలు 3లో..)

మొదటి పేజీ తరువాయి..

బల్క్ డ్రగ్‌పై ఉధృత పోరాటం

పార్కు కోసం కొత్తగా భూసేకరణ ప్రారంభించారని తెలిపారు. ఎవరిని ఉద్ధరించడానికి ఈ భూ సేకరణ చేపడుతున్నారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ఇప్పటికే హెటిరో కంపెనీ కాలుష్యం కారణంగా ఈ ప్రాంత ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, మత్స్యకారులు ఉపాధి కోల్పోయారని అన్నారు. ఫార్మా కంపెనీల కాలుష్యం వల్ల జిల్లాలోని తాడి గ్రామస్తుల జీవనం దయనీయంగా మారిందన్నారు. భూగర్భ జలాలు కలుషితమయ్యాయని తెలిపారు. గ్రామ ప్రజలు అక్కడ నివసించలేని పరిస్థితి ఏర్పడి, అక్కడ నుంచి తరలించాలని కోరుతున్నారన్నారు. చట్టాలను ఉల్లంఘించి బల్క్ డ్రగ్ పార్కు కోసం ప్రజాభిప్రాయ సేకరణ చేపట్టారని, ఇది ఎట్టి పరిస్థితుల్లోనూ చెల్లదని తెలిపారు. మందుల పరిశ్రమలు పెట్టాలంటే అనేక జాగ్రత్తలు తీసుకోవలసి ఉందన్నారు. జనావాసాలు, పంట పొలాలకు దగ్గర్లో ఆ పరిశ్రమలు ఉండకూడదన్నారు. పరిశ్రమలు వస్తే అభివృద్ధి జరుగుతుందని చంద్రబాబు చెబుతున్నారని, ఆచరణలో పరిశ్రమలు వస్తే యజమానులు, వారికి కొమ్ము కాసే రాజకీయ నాయకులు అభివృద్ధి అవుతున్నారన్నారు. మత్స్యకారులు శాంతియుతంగా ఆందోళన చేస్తుంటే పోలీసులు అనుమతి ఇవ్వకపోవడం దారుణమన్నారు. ఆందోళన చేసే హక్కు కూడా లేదా ? అని ప్రశ్నించారు. ప్రజల మనోభావాలు అర్థం చేసుకోకుండా ప్రభుత్వం మూర్ఖంగా ముందుకెళ్తే తగిన ప్రతిఫలం అనుభవించక తప్పదని హెచ్చరించారు. ప్రజల సంపదను కార్పొరేట్ సంస్థలకు పాలకులు కట్టబెడుతున్నారన్నారు. బల్క్ డ్రగ్ పార్క్ రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ మత్స్యకారులంతా ఐక్యంగా పోరాటం చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు ఎం.అప్పలరాజు, నాయకులు సత్యనారాయణ, ఎం.రాజేష్, మత్స్యకార నాయకులు ఎరిపిల్లి నాగేశ్వరరావు (నాగేష్), ఎం.మహేష్ బాబు, సోమేశ్వరరావు, పి.సత్తయ్య, బి.గుర్రన్న, పి.బుజ్జి, సోమేష్, పి.తాతీలు, డి.నానాజీ, పిఎం.సూరిబాబు, ఎం.రాంబాబు పాల్గొన్నారు.

నేడు విశాఖకు సీనియర్ బ్యాడ్మింటన్ విజేత లింగేశ్వరరావు



పతకంతో లింగేశ్వరరావు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : ఇటీవల తైవాన్‌లో ముగిసిన ప్రపంచ సీనియర్ బ్యాడ్మింటన్ పోటీల్లో విశాఖ నగరానికి చెందిన బ్యాడ్మింటన్ క్రీడాకారుడు స్టీల్‌ప్లాంట్ మాజీ ఉద్యోగి బివివిఎస్‌కె లింగేశ్వరరావు రజత పతకాన్ని సాధించారు. శనివారం ఆయన విశాఖ రానున్న సందర్భంగా స్వర్ణ భారతి బ్యాడ్మింటన్ అసోసియేషన్ సభ్యులు ఆయనకు అభినందనలు తెలిపారు. ప్రపంచవ్యాప్తంగా 54 దేశాల నుండి సుమారు 1700 మంది క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనగా మన దేశానికి చెందిన 198 మంది క్రీడాకారులు పాల్గొన్నారు. ఈ పోటీల్లో విశాఖపట్నంకు చెందిన లింగేశ్వరరావు మిక్స్‌డ్ డబల్ విభాగంలో చెన్నైకి చెందిన సహచర క్రీడాకారిని సుజన్ వింగ్లేట్‌తో కలిసి ఈ పతాకాన్ని సాధించారు. గతంలో 2013లో టర్కీలో జరిగిన ప్రపంచ చాంపియన్‌షిప్ పోటీల్లో 45 ప్లస్ సింగిల్స్ పురుషులు, డబుల్స్ భాగంలో రెండు కాంస్య పతకాలు సాధించగా, 2019 డెన్మార్క్‌లో జరిగిన పోటీల్లో 50 ప్లస్ సింగిల్స్ విభాగంలో కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు.

విద్యుత్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : విద్యుత్ ఉద్యోగుల సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని రాష్ట్రపవర్ ఎంప్లాయిస్ జెఎసి డిస్కం చైర్మన్‌వి.ఎస్.ఆర్.కె గణపతి డిమాండ్ చేశారు. ఈ మేరకు గ్రీన్ పార్క్ హోటల్ కు ఎదురుగా ఉన్న ఎస్ఇ కార్యాలయం ఆవరణలో నిరాహారదీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ 1999 నుండి 2004 మధ్య చేరిన ఉద్యోగులకు జిపిఎఫ్ సౌకర్యం కల్పించాలన్నారు. అలాగే చనిపోయిన ఉద్యోగుల కుటుంబానికి కారుణ్యనియామకాల ద్వారా బేషరుతుగా ఉద్యోగాలు ఇవ్వాలని కోరారు. అలాగే కాంట్రాక్ట్ కార్మికులను పర్మినెంట్ చేయాలని, ఖాళీ పోస్టులను భర్తీ చేసి పెండింగ్ డిఎలను మంజూరు చేయాలన్నారు. రిలే నిరాహారదీక్షలో యూనియన్ జిల్లా చైర్మన్ పి.నూకరాజు, కన్వీనర్ కె.టి.భాస్కరరాజు, విద్యుత్ ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘంటసాల, ఎన్‌టిఆర్, ఎఎన్‌ఆర్‌లకు భారతరత్న ప్రకటించాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఘంటసాల వెంకటేశ్వరరావు, మహానటులు ఎన్‌టిరామారావు, అక్కినేని నాగేశ్వరరావులకు భారతరత్న ప్రకటించాలని, ఆల్ ఇండియా ఘంటసాల చైతన్యవేదిక జాతీయ అధ్యక్షులు కోట వెంకటేశ్వరరెడ్డి డిమాండ్ చేశారు. అక్కినేని నాగేశ్వరరావు జయంతిలో భాగంగా శుక్రవారం ఆర్‌కె బీచ్‌లో ఘంటసాల విగ్రహం వద్ద నవ్యాంధ్ర సాంస్కృతిక చైతన్య ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ముందుగా ప్రచార బ్యానర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ, అమరావతిలో కృష్ణా నదికి ఇరువైపులా ట్యాంక్ బండ్ నిర్మాణం చేయాలని, 25 అడుగుల ఘంటసాల విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని, ఘంటసాల కళాక్షేత్రం నిర్మించాలని కోరారు. ఘంటసాల ఏకైక అవధాని డాక్టర్ సయ్యద్ రహంతుల్లా కార్యక్రమానికి అధ్యక్షత వహించారు. కార్యక్రమంలో ఘంటసాల చైతన్య వేదిక నాయకులు వడ్డాది గోపాలకృష్ణమూర్తి, ఉత్తరాంధ్ర జిల్లాల కన్వీనర్ బుర్ర శ్రీనివాసరావు, భయ్యా శ్రీనివాసరావు, రవీంద్రబాబు పాల్గొన్నారు.

కార్పొరేటర్ల అధ్యయన యాత్ర నివేదిక ఇవ్వండి

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ, విశాఖ కలెక్టరేట్ : జివిఎంసి కార్పొరేటర్లు, అధికారులు గత మూడేళ్లుగా నిర్వహిస్తున్న అధ్యయన యాత్రలపై నివేదికలు వెల్లడించడం లేదని, మళ్లీ నాలుగోసారి యాత్రకు వెళ్లారని, ఈ సారైనా యాత్ర నివేదికను బహిరంగపరచాలని వార్వా, నివాస్ కార్యదర్శులు బిబి.గణేష్, పిట్టా నారాయణమూర్తి శుక్రవారం జివిఎంసి కమిషనర్‌కు రాసిన లేఖలో కోరారు. ఇప్పటివరకూ ఏ యాత్రకు సంబంధించిన వివరాలూ కౌన్సిల్‌లో చర్చకు పెట్టలేదన్నారు.

వేటిని జివిఎంసి వారు అమలు చేశారో ప్రజలకు తెలియదని, ఈ మెగాటూర్‌కు అయ్యే ఖర్చులను నివాసితుల నుండి వసూలు చేస్తున్న ఆస్తిపన్ను నుండి భరించాల్సి వస్తోందని తెలిపారు. ఇటువంటి దుర్వినియోగం అరికట్టాలని విజ్ఞప్తి చేశారు.

నేడు తాగునీటి సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ దొండపర్తి 33/11 కెవి, టిఎస్ఆర్ సబ్‌స్టేషన్ నిర్వహణ కారణంగా శనివారం ఉదయం 6:30 నుండి 11గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలిపివేయడం జరుగుతుందని అందువలన జోన్ 3, 4 పరిధిలో పలు ప్రాంతాలకు తాగునీటి సరఫరాకి అంతరాయం ఏర్పడుతుందని జివిఎంసి తాగునీటి సరఫరా నిర్వహణ విభాగం కార్యనిర్వాహక ఇంజనీర్ మురళీకృష్ణ పత్రికా ప్రకటనలో తెలిపారు. జోన్-3 పరిధి వార్డు 19లోని లాసన్స్‌బే కాలనీ, పెద్దజాలారిపేట వార్డు 21 లో చిన్నవాల్తేరు, పెద్దవాల్తేరు వార్డు 22లోని పిఠాపురంకాలనీ, పీతలవానిపాలెం, శివాజీపాలెం వార్డు 23లో కెఆర్‌ఎం.కాలనీ, మద్దిలపాలెం, చైతన్యనగర్, కృష్ణ కాలేజీ రోడ్డు, వార్డు 25లోని సీతమ్మపేట, వార్డు 27లోని శ్రీనగర్, ద్వారకానగర్, రామాటాకీస్ ప్రాంతాలు, జోన్-4 పరిధిలో వార్డు 28లో రామ్‌నగర్, నెహ్రూనగర్, పితానిదిబ్బ, భానోజినగర్, వార్డు 29లో ప్రకాష్‌రావుపేట, వెంకటేశ్వరనగర్, కృష్ణనగర్ వార్డు 30లో జాలారిపేట, సాలిపేట, తాడివీధి, కుమ్మరవీధి, కోడిపందాలవీధి, వార్డు 31లో గొల్లలపాలెం, డాబాగార్డెన్స్ ఎస్‌బిఐ కాలనీ, జగదాంబ జంక్షన్, కనకలదిబ్బ తదితర ప్రాంతాల్లో తాగునీటికి అంతరాయం ఏర్పడుతుందని తెలిపారు.

కావున ప్రజలు సహకరించాలని కోరారు. అత్యవసరం అయిన ప్రదేశాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిసరఫరా చేస్తామని ఆదివారం నుంచి యధాతదంగా నీటిసరఫరా జరుగుతుందని కార్యనిర్వాహక ఇంజనీరు తెలియజేశారు.



భిక్షాటన చేస్తూ నిరసన తెలుపుతున్న విద్యార్థి సంఘం నాయకులు

మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై నిరసన

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం 10 మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని, అసెంబ్లీ సమావేశాలలో విద్యారంగ సమస్యలను చర్చించి పరిష్కరించాలని ఎఐఎస్ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బందెల నాసర్‌జీ డిమాండ్ చేశారు. ఆ సంఘం ఆధ్వర్యంలో జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద శుక్రవారం భిక్షాటన చేస్తూ వినూత్నంగా నిరసన చేపట్టారు. ప్రభుత్వ తీరును ఖండించారు. నాసర్‌జీ మాట్లాడుతూ పిపిపి విధానం వైద్య కళాశాలల్లో అమలు చేయడం వల్ల కొన్ని వందల మంది మెరిట్ విద్యార్థులకు ఎంబిబిఎస్ విద్య దూరమౌతుందన్నారు

పోలీస్ కమిషనరేట్‌లో వెహికల్ రిటర్న్ మేళా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : విశాఖ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వివిధ కేసుల్లో పోలీసులు సీజ్ చేసిన మోటార్ వాహనాలను సిపి డాక్టర్ శంఖబ్రతబాగ్చి ఆధ్వర్యంలో సంబంధిత వాహన యజమానులకు వెహికల్ రిటర్న్ మేళా ద్వారా శుక్రవారం అందజేశారు. నగరంలోని పోలీస్ పరేడ్‌గ్రౌండ్‌లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భారత గృహ మంత్రిత్వ శాఖ నిబంధనల ప్రకారం యజమానుల చిరునామాలను సేకరించి సంబంధిత యజమానులకు వాహనాలు అందించారు. ఇప్పటి వరకూ జరిగిన మేళాల్లో 818 వాహనాలను తిరిగి యజమానులకు అప్పగించినట్టు పోలీస్ కమిషన్ మీడియాకు తెలిపారు.

IN THE COURT OF THE III ADDL. SENIOR CIVIL JUDGE, KAKINADA
I.A.No.146/2024, I.A.No.145/2024, I.A.No.670/2024, I.A.No.669/2024 in O.S. No.65/2024

Between:
Inuganti Rangababu ...Petitioner/Plaintiff
and
Konada Dhanalakshmi & others ...Respondents/Defendants

To: Respondent/Defendant:
6) Tirumalaraju Sandhya, D/o. (Late) Manthena Rama Rjau, W/o. Tirumalaraju Venkata Ramaraju, Business, D.No.1-54, Srirampuram, Payikaraopuram, Anakapalli District.

పై నెంబరు దావా/పిటిషన్స్‌లో I.A.No.146/2024, I.A.No.145/2024, I.A.No.670/2024, I.A.No. 669/2024లలో 6వ రెస్పాండెంట్/ప్రతివాది అయిన మీకు శ్రీ కోర్టువారి ద్వారా ఎన్నిసార్లు దావా సమన్లు/నోటీసులు పంపినను తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టువారు మీ హాజరు నిమిత్తం ది.**22-09-2025** సం॥రం తేదీకి వాయిదా వేసినారు. మీరు ఆరోజు ఉదయం గం॥ **10.30** ని॥లకు స్వయంగా గాని, మీ వకీలు ద్వారా గాని పై కోర్టువారి ఎదుట హాజరయ్యి మీ యొక్క ఆక్షేపణలు తెలియపర్చుకోవలెను. లేనియెడల మీ పరోక్షమున తీర్మానించబడును.

(శ్రీ కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం)

K.V.S.V.లక్ష్మాజీరావు (వేణు)
అడ్వకేట్, డో.నెం.6-1-9/1, దూసర్లపూడివారి వీధి, కాకినాడ, సెల్: 9866211196

మహారాజశ్రీ నర్సీపట్నం సివిల్ జడ్జి (సీనియర్ డివిజన్) వారి కోర్టులో
EP 10/2023 OS 169/2011

వాది :
శ్రీ రాజగోపాల ఫైనాన్స తంగేరు తరుపున మేనేజింగ్ భాగస్వామి దాట్ల వెంకట సూర్యనారాయణ రాజు తండ్రి బుచ్చి వెంకట రాజగోపాల రాజు

ప్రతివాదులు :
కరక నర్శింహమూర్తి

వేలం ప్రకటన

పై నెంబరు అమలు బాకీ వగైరాలను రాబట్టే నిమిత్తం వాది తాలుకా ఈ దిగువ షెడ్యుల్డు స్థిరాస్తిని వేలం కోరి ప్రతివాదులు అమలు దాఖలు చేయగా శ్రీ కోర్టు వారు వేలం నిమిత్తం తేది.28-08-2025 కావున ఆసక్తి వున్నవారు సదరు వేలంలో పాల్గొని పాడుకునదలచిన వారు **తేది.22-09-2025న ఉదయం 10గంటల 30 నిమిషములకు** పై కోర్టులో హాజరయ్యి వేలం పాడుకొనవలెను.

వేలం తేది : 22-09-2025

షెడ్యూలు

అనకాపల్లి జిల్లా నర్సీపట్నం సబ్ డివిజన్ నాతవరం మండలం ఎల్లవరం దొండపేట గ్రామం నందు మెట్టు భూమి (జిరాయితి) సర్వే నెం.175 నందు 1 ఎకరా 13 సెంట్లు, సర్వే నెంబరు 176/6 నందు 0.99 సెంట్లు కలదు. మొత్తం జిరాయితీ మెట్ట భూమి 2 ఎకరముల 12 సెంట్లు.

హద్దులు

తూర్పు - బోనికొండ
దక్షిణం - గవిరెడ్డి అమ్మాన్న మరియు లాలం అచ్చిరాజు భూమి.
పడమర - R & B రోడ్డు (తుని-నర్సీపట్నం)
ఉత్తరం - అంకంరెడ్డి నూకన్న మరియు కొండ గార్ల భూమి.
డిహెచ్‌ఆర్ విలువ : రూ.8,00,000-00
మార్కెట్ విలువ : రూ.7,00,000/-
అమిన్ విలువ : రూ.

మెట్ట ప్రభాకర్
న్యాయవాది, నర్సీపట్నం
నర్సీపట్నం సెల్ : **8179154586, 7989015974**
తేది.17-09-2025

IN THE HON'BLE COURT OF II ADDL. SENIOR CIVIL JUDGE, AT VIJAYAWADA
O.S.NO.19/2025

Between:
Kakumanu Mruthyunjaya Rao
Prop: Annapurna Rice and General Tradeers, Vijayawada-12 - Plaintiff
AND
Kolla Lakshmi
Prop: Raj Traders, Vijayawada - Defendant
To
The Defendant: Kolla Lakshmi, D/o D.Krishna, Proprietrix, Raj Traders, Vijayawada, aged about 41 years, resident of D.No.14-27-20/2, SL Towers, Plot No.305, Opposite SBI Bank, Raji Road, Maharanipeta, Visakapatnam-530002, Mobile No:9550563963

The above named Plaintiff filed the above Suit against the Defendant for "for the suit amount **Rs.30,93,107/-** and other relief or reliefs and the said Suit was posted to **17-10-2025** for your appearance. **You have to attend at 10.30 AM on that day before the above said Hon'ble Court** in person or through advocate, failing which the above petition will be decided setting you exparte.

(By Order of the Court)
CH.AJAY KUMAR, Advocate
Jadagamvari Street, Suryaraopet, Vijayawada-2. Ph: 2432345; 9848128444

IN THE HONOURABLE COURT OF JUNIOR CIVIL JUDGE, KOTHAVALASA
O. S. 91/2019

Between:
Dogga Kasi Visweswara Rao ... Plaintiff
And:
Dogga Pydithallamma and others ... Defendants
To:
D-11: Katari Prasoona, w/o Sudhakararao, r/o D. No. 18-126, Sri Vibhav Laxmi Residency, Bharat Nagar, behind Simhadri Hospital, Prahladapuram, Visakhapatnam City.

Whereas the above-named Plaintiff has instituted a suit against you for the suit claim, you are hereby summoned to appear before this Court in person, or by a Pleader duly instructed and able to answer all material questions relating to the suit, or accompanied by some person able to answer all such questions, on the 7th day of October, **2025 at 10:30 A.M.** in the forenoon, to answer the claim.

Take further notice that the said date has been fixed for the final disposal of the suit, and you must be prepared to produce on that day all the witnesses upon whose evidence, and all the documents upon which, you intend to rely in support of your defence. in default of your appearance on the said day and at the said hour, the suit will be heard and determined in your absence.

By Order
M. V. S. GIRIBABU
ADVOCATE
Kothavalasa-535 183,
Mobile: 9493939595.

IN THE HONOURABLE COURT OF JUNIOR CIVIL JUDGE, KOTHAVALASA
O. S. 36 of 2024

Between:
Smt. Lenka Kanakalaxmi ...Plaintiff
And:
Sri. Pediredla Appalaraju & Others ...Defendants
To:
Sri. Pediredla Pandu, S/o Sannibabu, Real Estate Business, R/o Prasanthi Nagar, Pendurthi Mandal, Visakhapatnam District.

Whereas the above-named Plaintiff has instituted a suit against you for the suit claim, you are hereby summoned to appear before this Court in person, or by a Pleader duly instructed and able to answer all material questions relating to the suit, or accompanied by some person able to answer all such questions, on the 6th day of **October, 2025, at 10:30 A.M**. in the forenoon, to answer the claim.

Take further notice that the said date has been fixed for the final disposal of the suit, and you must be prepared to produce on that day all the witnesses upon whose evidence, and all the documents upon which, you intend to rely in support of your defence, in default of your appearance on the said day and at the said hour, the suit will be heard and determined in your absence.

By Order
M. V. S. GIRIBABU
ADVOCATE
Kothavalasa-535 183,
Mobile: 9493939595.

బడుగులపై ప్రతాపం

- ఆక్రమణల పేరిట దుకాణాలు, బండ్లు తొలగింపు
- కన్నీరుమున్నీరవుతున్న చిరువ్యాపారులు
- జివిఎంసి తీరుపై విమర్శలు



ఆరిలోవలో రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేస్తున్న చిరు వ్యాపారులు

చిరువ్యాపారులపై జివియంసి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు కన్నెర్ర చేశారు. రెండవజోన్ జెడ్‌సి కనకమహాలక్ష్మి, ఎసిపి శాస్త్రి ఆధ్వర్యంలో శుక్రవారం 11వ వార్డు అంబేద్కర్ కూడలిలో రోడ్డు పక్క దుకాణాలను తొలగించారు. దీనితో వ్యాపారులు, అధికారుల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో వ్యాపారులు రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేపట్టారు.కొంతసేపు ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. పోలీసులు రంగ ప్రవేశంతో రోడ్డుపై బైఠాయించిన వ్యాపారులకు నచ్చజెప్పి, అడ్డును తొలగించారు.

ప్రత్యామ్నాయం చూపించాలి..

రోడ్డు పక్కన వ్యాపారాలతో జీవనం సాగిస్తున్న తమను ఉన్నఫలానా తొలగించడంతో కుటుంబపోషణ ఎలాగని చిరువ్యాపారులు ప్రశ్నించారు. తమకు ప్రత్యామ్నాయం చూపించాలని వేడుకున్నారు. ఆరిలోవ బాలాజీనగర్, ఆరిలోవ కాలనీ చివరన జివిఎంసి నిర్మించిన దుకాణాలు నిరుపయోగంగా ఉన్నాయని, తక్కువ అద్దెకు తమకు కేటాయిస్తే అక్కడ వ్యాపారాలను చేసుకుంటామన్నారు.

రెండోరోజూకొనసాగిన ఆక్రమణ తొలగింపు

మధురవాడ : జివిఎంసి రెండో జోన్ మిథిలాపురి వుడాకాలనీలో రెండో రోజు శుక్రవారం గాంధీ బొమ్మ వరకు ఇరువైపులా ఫుట్‌పాత్‌లపై ఉన్న చిరువ్యాపారుల దుకాణాలను తొలగించారు. శుక్రవారం ఉదయం జివిఎంసి ప్రధాన కమిషనర్ అమిత్‌గార్గ్ ఆయా ప్రాంతాలను పరిశీలించారు. రోడ్డుపక్కనున్న దుకాణాలను పూర్తి స్థాయిలో తొలగించాలని సూచించారు. నిబంధనలు అతిక్రమిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఎవరైనా అతిక్రమించినా, అడ్డుకున్నా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. జెడ్‌సి కనకమహాలక్ష్మి, సిటీ ప్లానర్ ధనుంజయరెడ్డి, టిపిఒ శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

సీతమ్మధార : జివిఎంసి మూడవ జోన్‌లో సాయిబాబా గుడి వద్ద నుండి సంగం ఆఫీస్, దొండపర్తి, ద్వారకా నగర్, డైమండ్ పార్క్ పరిసర ప్రాంతాల్లో రోడ్డు పక్కన, ఫుట్‌పాత్‌లపై ఉన్న చిరువ్యాపారులను దుకాణాలను పూర్తిగా తొలగించినట్లు టౌన్ ప్లానింగ్ ఎసిపి మధుసూదనబాబు తెలిపారు. పట్టణ ప్రణాళిక అధికారులు తెల్లవారుజామున 6 గంటలకే ఆయా ప్రాంతాలకు చేరుకుని తోపుడు బళ్ళు బడ్డీలను తొలగించారు.

సెంట్రల్ పార్క్ ఫుడ్ కోర్టు దుకాణాల తొలగింపు

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలకు ఎదురుగా సెంట్రల్ పార్కును ఆనుకొని ఉన్న సర్వీస్ రోడ్డులో దాదాపు దశాబ్ద కాలంగా నడుస్తున్న నైట్ ఫుడ్ కోర్టులో ఉన్న దుకాణాలను శుక్రవారం జివిఎంసి అధికారులు పోలీసు బందోబస్తు నడుమ తొలగించారు. తొలగింపు విషయం తెలియడంతో అక్కడకు చేరుకున్న దుకాణాల నిర్వాహకులు, వారి కుటుంబ సభ్యులు తొలగింపు చర్యలను అడ్డుకునే ప్రయత్నం చేశారు. అధికారుల చర్యను నిరసిస్తూ నినాదాలు చేశారు. ఒక దుకాణదారుడు రోడ్డుపై అర్ధనగ్నంగా పడుకొని తమ పొట్టకొట్టొద్దని వేడుకోవడం పలువురిని కంటతడిపెట్టించింది. పోలీసులు అతన్ని పక్కకు తొలగించి, జెసిబిల సాయంతో బడ్డీలను, తోపుడు బళ్లను తొలగించారు.

ఆరిలోవ : రోడ్డు మార్జిన్లు, ఫుట్‌పాత్‌ల్లో

పొట్ట కొట్టొద్దు : సిఐటియు

ప్రజాశక్తి-మధురవాడ : జివిఎంసి అధికారులు ఏటువంటి సమాచారం లేకుండా చిరు వర్తకులపై దాడి చేయడాన్ని నిరసిస్తూ సిఐటియు ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన చేపట్టారు. మిథిలాపురి వుడా కాలనీ నుంచి జివిఎంసి జోనల్ కార్యాలయం వరకు నినాదాలు చేస్తూ భారీ ర్యాలీ చేపట్టారు. అంబేద్కర్ విగ్రహం వద్ద నినాదాలు చేశారు. జోనల్ కమిషనర్ ఛాంబర్ ముందు బైఠాయించి ఆందోళన చేపట్టారు. జెడ్‌సి స్పందించకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసి, సర్వీస్‌రోడ్డులో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జోన్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు డి.అప్పలరాజు పి.రాజుకుమార్ మాట్లాడుతూ వీధి విక్రయదారుల చట్టాలను అమలుచేయకపోగా, వారి జీవనోపాధిని లేకుండా చేసి పొట్టగొట్టడం అమానుషమన్నారు. తోపుడుబళ్ళు,చిల్లర వర్తకంతో కుటుంబపోషణ పొందుతున్న వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు.



సిఐటియు ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న చిరువ్యాపారులు

వీధిపాలు చేయొద్దు

తగరపువలస : ఆక్రమణల పేరుతో రోడ్డుకు ఇరువైపులా ఉన్న తోపుడు బళ్ళు చిరు వ్యాపారులను తొలగించడం ద్వారా వారి బతుకులను రోడ్డు పాలుచేయొద్దని సిపిఐ భీమిలి ఏరియా సమితి కార్యదర్శి కానూరు రాంబాబు, సహాయ కార్యదర్శి మోర అప్పలరాజు ఆరోపించారు. శుక్ర వారం జిఆర్ భవన్ లో సమావేశంలో చిరువ్యాపారుల తొలగింపును తీవ్రంగా ఖండించారు. వారికి ప్రత్యామ్నాయం చూపాలన్నారు. పార్టీ నాయకులు ఎం వీర్రాజు, ఆదినారాయణ, అప్పారావు పాల్గొన్నారు

హాకర్ జోన్ ఏర్పాటు చేయాలి

మధురవాడ : మధురవాడ ఏరియాలో చిల్లర వర్తకులకు, స్ట్రీట్ వెండర్లకు హాకర్ జోన్ ఏర్పాటు చేయాలని సిపిఐ రాష్ట్ర సమితి సభ్యుడు, ఎం పైడిరాజు డిమాండ్ చేశారు. మధురవాడ జంక్షన్‌లో డీమార్ట్, ఇతర పెద్దషాపింగ్‌మాల్స్‌తో నిత్యం ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నా వాటి జోలికి పోని జివిఎంసి యంత్రాంగం చిరువ్యాపారుల దుకాణాలను తొలగించి వారి పొట్టకొట్టడం దుర్మార్గమన్నారు. వారికి ప్రత్యామ్నాయం చూపి ఆదుకోవాలని డిమాండ్ చేశారు.

నేరాలు ఘోరాలు

గంజాయి కేసులో నిందితుని అరెస్టు

ప్రజాశక్తి-గొలుగొండ: గొలుగొండ పోలీస్‌స్టేషన్ పరిధిలో నమోదైన 216 కేజీల అక్రమ గంజాయి రవాణా కేసులో నిందితుడు చొప్ప నాగరాజును అరెస్టు చేసినట్లు గొలుగొండ ఎస్సై పి.రామారావు తెలిపారు. ఇతనిది బుచ్చయ్యపేట మండలం చిన్నమల్లవరం గ్రామమని తెలిపారు. ఇతనిపై వివిధ పోలీస్‌స్టేషన్లలో మొత్తం ఎనిమిది క్రిమినల్ కేసులు ఉన్నాయని చెప్పారు.

27 మద్యం బాటిళ్ల స్వాధీనం

ప్రజాశక్తి- ఆనందపురం : మండలంలో మద్యం అక్రమ అమ్మకాలకు పోలీసులు చెక్ పెట్టారు. నీళ్లకుండీల వద్ద ఒక పాన్‌షాప్‌లో మద్యం అక్రమ అమ్మకాలు జరుగుతున్నట్లు సమాచారంతో సిఐ చింత వాసు నాయుడు సూచనలతో ఎస్ఐ గంట్యాడ సంతోష్ సిబ్బందితో దాడి చేసి 21 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. దుక్కవానిపాలెంలో మరో పాన్‌షాప్‌పై దాడి చేసి ఆరు బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. రెండు ఘటనలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పలువురిపై బైండోవర్ కేసులు

ప్రజాశక్తి- పెందుర్తి : ఇటీవల స్థల వివాదంతో గొడవలు రేగిన నరవలో అవి పునరావృతం కాకుండా పోలీసులు కఠినచర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా వివాదంలో భాగమైన వారిపై పటిష్ఠ నిఘాపెట్టడంతోపాటు, రెండు పార్టీలకు చెందిన పలువురిపై బైండోవర్ కేసు నమోదు చేశారు. పెందుర్తి పోలీస్‌స్టేషన్ సిఐ సతీష్ కుమార్ తెలిపిన వివరాలివి. పెదగాడి గ్రామంలో ఒక స్థలం వివాదం కారణంగా నాలుగు పార్టీలకు చెందిన 14 మంది వ్యక్తులు పరస్పరం ఘర్షణలకు దిగుతూ, గ్రామంలో శాంతిభద్రతలకు తరచూ విఘాతం కలిగిస్తున్న పరిస్థితుల్లో అవి, గొడవలు మరింత తీవ్రం కాకుండా పెందుర్తి తహశీల్దార్ కోర్టులో బైండోవర్ చేశారు. దీనిపై విచారణ చేసిన తహశీల్దార్ వెంకట అప్పారావు, రెండు పార్టీలకు చెందిన పలువురిపై రూ.3లక్షలకు వ్యక్తిగత పూచీకత్తు ఉండేలా బైండోవర్ చేశారు. గొడవలు పునరావృతమైతే కఠినచర్యలు ఉంటాయని హెచ్చరించారు.

హెచ్‌పిసిఎల్‌లో ప్రమాదం

- కంప్రెసర్ షెడ్‌లో గ్యాస్ లీకేజీ
- భయంతో పరుగులు తీసిన కార్మికులు



గ్యాస్‌లీకైన హెచ్‌పిసిఎల్ విస్తరణ ప్లాంట్, ప్రమాదంపై సిఐ ఆరా

ప్రజాశక్తి- ములగాడ : హెచ్‌పిసిఎల్ విశాఖ రిఫైనరీ విస్తరణ పనుల్లో భాగంగా రఫ్ ప్లాంట్ మెయింటెనెన్స్ పనుల్లో టెస్టింగులు జరుగుతుండగా హైడ్రో కంప్రెసర్ వద్ద పైప్‌లైన్ ఫ్లాంజ్ వద్ద గ్యాస్ లీకేజీతో శుక్రవారం ఉదయం ప్రమాదం చోటుచేసుకుంది. ఉదయం తొమ్మిది గంటలకు కార్మికులు విధుల్లోకి చొరబడుతుండగా ప్రమాదంతో కార్మికులందరూ భయంతో పరుగులు తీశారు. వెంటనే సంస్థ అధికారులు అగ్నిమాపక శకటాలతో అక్కడకు చేరుకుని అదుపు చేశారు. విషయం తెలుసుకున్న మల్కాపురం సిఐ గొలగాని అప్పారావు, తహశీల్దార్ రమేష్‌నాయుడు, పొల్యూషన్ కంట్రోల్‌బోర్డ్ ఎఇ ముకుందరావు తదితరులు ఘటన స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. ప్రమాద వివరాలను తెలుసుకున్నారు. ఎటువంటి ప్రమాదం చోటుచేసుకోలేదని, ప్రజలు భయాందోళన చెందక్కర్లేదని సంస్థ అధికారులు వెల్లడించారు. పారిశ్రామిక ప్రాంతంలో వరస ప్రమాదఘటనలతో స్థానికులు భీతిల్లుతున్నారు.

చెత్త వేయొద్దని హెచ్చరిక బోర్డు

ప్రజాశక్తి- వేపగుంట : జివిఎంసి ఎనిమిదో జోన్ 94వ వార్డు అప్పల నరసయ్య కాలనీలో శుక్రవారం ఉదయం కాలనీ వాసులకు చెత్త సేకరణపై సచివాలయ శానిటేషన్ సెక్రటరీ, జివిఎంసి పారిశుధ్య సిబ్బంది అవగాహన కల్పించారు. తడిపొడి చెత్తను వేరుచేసి క్లాప్ వాహనాలకు అందించాలని సూచించారు. ఖాళీ ప్రదేశాల్లో, వీధి శివారుల్లో చెత్త వేస్తే జరిమానా విధిస్తామని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు

ఆక్రమణలు తొలగించి అభివృద్ధికి సహకరించండి

ప్రజాశక్తి - ఆనందపురం : మండలంలోని లొడగలవానిపాలెం ఎస్‌సి కాలనీలో తాగునీరు, డ్రైనేజీ సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. శుక్రవారం దళిత నాయకుడు సియ్యాద్రి రాంబాబు ఆధ్వర్యంలో తహశీల్దార్ శ్రీనుబాబుకు వినతిపత్రం అందజేశారు. లొడగలవానిపాలెం ఎస్‌సి కాలనీలో ఏళ్లతరబడి ఇదే పరిస్థితి నెలకొన్నా పట్టించుకోవడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఎంపిడిఒ దృష్టికి తీసుకెళ్లగా, తాగునీటి పైపులైన్లు, రోడ్డుకి ఇరువైపులా డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారని, అయితే కొంతమంది ఇళ్ల మెట్లు, ప్రహరీ వంటి అక్రమ నిర్మాణాలు కారణంగా పైపులైన్ల పనులు ఆగిపోయాయన్నారు. తహశీల్దార్ స్పందించి, అక్రమణలను తొలగించి అభివృద్ధికి సహకరించాలని కోరారు. భాగం గోపాలరావు, ఎం. సునీల్ ఉన్నారు.

కమిషనర్ చొరవతో తొలగిన ముప్పు

ప్రజాశక్తి -మధురవాడ : వియంఆర్‌డిఎ కమిషనర్ చొరవతో శ్మశానవాటిక ప్రహరీకి ముప్పు తప్పింది. ఏడోవార్డు నగరంపాలెం సచివాలయం నుండి వాంబే కాలనీకి రోడ్డు నిర్మాణంలో భాగంగా శ్మశానం ప్రహరీని ఆనుకుని గ్రావెల్ తవ్వడంతో గోడ కూలే ప్రమాదం ఉందని ఫిర్యాదుతో. కమిషనర్ ఆదేశాలతో రాత్రికిరాత్రే సంబంధిత కాంట్రాక్టర్ రోడ్డును యథాస్థితికి తెచ్చారు. దీనిపై స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. వెంటనే స్పందించిన వియంఆర్‌డిఎ కమిషనర్‌కు సిపిఎం నేత మరుపిళ్ల పైడిరాజు ధన్యవాదాలు తెలిపారు.

సాంకేతిక నైపుణ్యంతో ఉజ్వల భవిష్యత్

- పాలిటెక్నిక్ విద్యార్థుల ఫ్రెషర్స్‌డే వేడుకల్లో ముత్తంశెట్టి



అనుమతి పత్రాలను చూపుతున్న ముత్తంశెట్టి

ప్రజాశక్తి-తగరపువలస: నేటి పోటీ ప్రపంచంలో విద్యార్థులు, యువత సాంకేతిక నైపుణ్యాన్ని అందిపుచ్చుకోవాలని అవంతి విద్యాసంస్థల ఛైర్మన్, మాజీ మంత్రి ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాలలో పాలిటెక్నిక్ విద్యార్థుల ఫ్రెషర్స్‌డే వేడుకలను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన ముత్తంశెట్టి మాట్లాడుతూ, ప్రతి విద్యార్థీ టెక్నికల్, సాఫ్ట్, కమ్యూనికేషన్ స్కిల్స్ , ప్రాక్టికల్ నాలెడ్జ్‌పై దృష్టి పెట్టాలన్నారు.కష్టపడే తత్వాన్ని అలవాటు చేసుకోవాలన్నారు. భీమిలి ప్రభుత్వ మహిళా పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణ మాట్లాడుతూ, పాలిటెక్నిక్ విద్యార్థులకు అపారమైన ఉద్యోగావకాశాలు ఉన్నాయన్నారు. కృషి, పట్టుదలతో చదివి, వ్యక్తిత్వం, నైపుణ్యతను పెంపొందించుకోవాలన్నారు. భోగాపురం ఎక్సైజ్ సిఐ వి.రవికుమార్ మాట్లాడుతూ, డ్రగ్స్, మత్తుపదార్థాల జోలికి వెళ్లొద్దని సూచించారు.తల్లిదండ్రుల కష్టాన్ని నిత్యం గమనంలో ఉంచుకుని, ఆదర్శంగా నిలవాలన్నారు అవంతి విద్యాసంస్థల డైరెక్టర్ ఎ చంద్రశేఖర్, ఇంజనీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ బి మురళీకృష్ణ, పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ బి జగదీశ్వరరావు, వివిధ విభాగాధిపతులు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు . వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు.

రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు అనుమతి

ప్రజాశక్తి -తగరపువలస : స్థానిక అవంతి ఇంజనీరింగ్ కళాశాల ఇసిఇ విభాగంలో రీసెర్చ్ సెంటర్ ఏర్పాటుకు అనుమతి లభించినట్లు విద్యాసంస్థల ఛైర్మన్ ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు.ఈ మేరకు కళాశాల ప్రిన్సిపాల్ బి.మురళీకృష్ణకు విజయనగరం జెఎన్‌టియు జివి వైస్ ఛాన్సలర్ డాక్టర్ డి రాజ్యలక్ష్మి శుక్ర వారం అనుమతి పత్రాన్ని అందజేశారు. దీనిపై ముత్తంశెట్టి హర్షం వ్యక్తం చేశారు. అవంతి విద్యా సంస్థల డైరెక్టర్ ఎ చంద్రశేఖర్, ఇసిఇ విభాగం ప్రతినిధులు పాల్గొన్నారు.

60 మంది విద్యార్థుల రక్తదానం



రక్తదాతల సర్టిఫికెట్లతో బాసర కాలేజీ విద్యార్థులు

ప్రజాశక్తి-తగరపువలస :స్థానిక శ్రీబాసర డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన మెగా రక్తదాన శిబిరాన్ని విద్యా సంస్థల చైర్మన్ పూడి రమేష్ ప్రారంభించారు.కెజిహెచ్ బ్లడ్‌బ్యాంకు సౌజన్యంతో నిర్వహించిన శిబిరంలో 60 మంది విద్యార్థులు, అధ్యాపకులు రక్త దానం చేశారు. రక్తదాతలకు సర్టిఫికెట్లు అందజేశారు డాక్టర్ టివి నాయుడు, డిగ్రీ, జూనియర్ కళాశాలల ప్రిన్సిపాల్స్ సిహెచ్ సురేష్, వివిడి రమేష్, ఎ.ఐ కేశవ, వైస్ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, బంగార్రాజు పాల్గొన్నారు

అదానీ సిమెంట్ ఫ్యాక్టరీ వద్దు

ప్రజాశక్తి-గాజువాక : ఆదానీ గంగవరం పోర్టు యాజమాన్యం పెదగంట్యాడ శివారులో సిమెంట్ గ్రేండింగ్ యూనిట్ ఏర్పాటు ప్రక్రియను తక్షణమే నిలిపేయాలని డిమాండ్ చేస్తూ, శుక్రవారం సిపిఐ ఆధ్వర్యంలో ఫ్యాక్టరీ ఏర్పాటు ప్రతిపాదిత ప్రాంతంలో నిరసన చేపట్టారు . ఈ సందర్భంగా సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ మాట్లాడుతూ గంగవరం పోర్టు పుణ్యమాని ఇప్పటికే పెదగంట్యాడ, గంగవరం, గాజువాక ప్రాంతాలు కాలుష్యం బారినపడ్డాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఇపుడు 20 ఎకరాల విస్తీర్ణంలో కాలుష్య కారకమైన అదానీ అంబుజా సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటైతే గాజువాక జోన్‌లోని ఏడు వార్డుల ప్రజల ఆరోగ్యం, వారి జీవన మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే సిమెంట్ ఫ్యాక్టరీ ఏర్పాటు ప్రతిపాదన విరమించుకోవాలని, లేకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. నిరసనలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యురాలు కె. వనజాక్షి, నాయకులు జి. ఆనంద్, పల్లేటి పోలయ్య, కె. అచ్యుతరావు, పి. దుర్గారావు, కె. పోతయ్య, గణేష్ , పిల్లా పద్మ పాల్గొన్నారు.

ముగిసిన ఉచిత నట శిక్షణ శిబిరం

ప్రజాశక్తి - ఆరిలోవ : క్రమశిక్షణ, సంకల్పం ఉంటేనే విజయాన్ని అందుకోగలమని బాలల హక్కుల పరిరక్షణ సంస్థ (సిఆర్‌పి.ఫ్.) జిల్లా కన్వీనర్ మునీర్ ముషీద్ అన్నారు. ఆరిలోవ దీనదయాల్‌పురం ప్రభుత్వ బాలల గృహంలో నవరస థియేటర్స్ ఆర్ట్స్ అసోసియేషన్ మూడు వారాలు పాటు నిర్వహించిన ఉచిత నట శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతూ, . బాలలకు నట శిక్షణ ఇవ్వడం శుభ పరిణామమన్నారు సిఆర్‌పిఎఫ్ కో కన్వీనర్ సిహెచ్. విశాలాక్షి మాట్లాడుతూ నటశిక్షణతో బాలల్లో క్రమశిక్షణ, ఆలోచన శక్తి, వ్యక్తిత్వ వికాసం, నాటకాభిరుచి పెరుగుతుందన్నారు. ఇలాంటి శిక్షణ శిబిరాలు అన్ని ప్రభుత్వ గృహాల్లో నిర్వహించాలన్నారు ప్రభుత్వ బాలల గృహం సూపరింటెండెంట్ పి. రమణ మాట్లాడుతూ నవరస సంస్థతో తాము చాలా కాలంగా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, పిల్లలకు నట శిక్షణ శిబిరాలు నిర్వహిస్తూ వారిలోని నైపుణ్యాన్ని వెలికి తీయడం అభినందనీయమన్నారు.

అసోసియేషన్ అధ్యక్షులు ఎన్. నాగేశ్వరరావు అధ్యక్షతన సమావేశంలో బాలుర గృహం వైద్యులు డాక్టర్. జీవన్ ఉపాధ్యాయిని వరలక్ష్మి, కార్యదర్శి పివిఆర్ మూర్తి, సంఘం ప్రతినిధి డి హేమ వెంకటేశ్వరి, డిప్యూటీ సూపరింటెండెంట్ సత్యనారాయణ, నవరస సంస్థ ప్రతినిధి యశ్వంత్ పాల్గొన్నారు. శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు.

కొండవాలులో అభివృద్ధి పనులు

ప్రజాశక్తి -ములగాడ : జివిఎంసి 62 వ వార్డు త్రినాధపురం కొండవాలు ప్రాంతంలో రూ.12లక్షలతో చేపట్టిన సిసి రోడ్లు, మెట్లమార్గం అభివృద్ధి పనులను టిడిపి వార్డు అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు, తెలుగు మహిళ వార్డు అధ్యక్షురాలు లక్ష్మి, యూనిట్ ఇంచార్జీ చంద్రశేఖర్, బూత్ ఇన్‌చార్జిలు దుర్గారావు, ముత్యాలనాయుడు తదితరులు శుక్రవారం పరిశీలించారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పశ్చిమ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ప్రత్యేక దృష్టితో నిధులు మంజూరు చేయించారని టిడిపి నేతలు వెల్లడించారు.

విద్యారంగ సమస్యలపై యుటిఎఫ్ రణభేరి

- జాతాకు అడుగడుగునా విశేష స్పందన
- కూటమి ప్రభుత్వ హామీల అమలుకు డిమాండ్



ఆనందపురంలో కొనసాగుతున్న యుటిఎఫ్ రణభేరి జాతా

ఉపాధ్యాయ, విద్యారంగ సమస్యల పరిష్కారానికి యుటిఎఫ్ రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన జాతాకు విశాఖ జిల్లాలో విశేష స్పందన వచ్చింది. రాష్ట్రవ్యాప్తంగా ఐదుబృందాలతో యుటిఎఫ్ రణభేరి ప్రచార జాత నిర్వహిస్తుండగా, ఈనెల 15న శ్రీకాకుళం జిల్లా పలాసలో ప్రారంభమైన బృందం, శ్రీకాకుళం, విజయనగరం, అల్లూరి, అనకాపల్లి జిల్లాల మీదుగా శుక్రవారం విశాఖ జిల్లా ఆనందపురంలో ప్రవేశించింది. యుటిఎఫ్ రణభేరి జాతాకు స్థానిక యుటిఎఫ్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు సాదరంగా స్వాగతించగా, ఆనందపురం, మధురవాడ, చంద్రంపాలెం మీదుగా గాజువాక వరకు కొనసాగి అక్కడ ముగిసింది.

(ప్రజాశక్తి - విలేకర్ల యంత్రాంగం)

ప్రభుత్వ పాఠశాలల రక్షణకు....

ఆనందపురం : ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ, ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యల పరిష్కారారమే యుటిఎఫ్ రణభేరి ప్రచారజాతా లక్ష్యమని ఆ యూనియన్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహన్‌రావు, రాష్ట్ర కార్యదర్శి కిశోర్‌కుమార్ స్పష్టం చేశారు. శుక్రవారం విశాఖ జిల్లా నందపురం కూడలిలో ప్రారంభమైన ప్రచారజాతా, అక్కడి నుండి విశాఖనగరంవైపు సాగింది.చంద్రంపాలెం, మధురవాడ, ఇతర కూడళ్లలో కొనసాగి, గాజువాకతో ముగిసింది. ఈ సందర్భంగా యుటిఎఫ్ నేతలు మాట్లాడుతూ, గత ప్రభుత్వం ప్రపంచ బ్యాంకు ఒప్పందంలో భాగంగా అమలు చేసిన సాల్ట్ పథకం పాఠశాల విద్యా వ్యవస్థను దెబ్బతీసిందని, అదే విధానాన్ని ప్రస్తుత ప్రభుత్వం కొనసాగించడం వల్ల విద్యార్థుల ప్రవేశాలు తగ్గుతున్నాయని విమర్శించారు. యాప్ అప్‌లోడ్‌తోనే పాఠశాల సమయమంతా వృథా కావడంతో పిల్లలకు నాణ్యమైన విద్య అందకుండా చేస్తున్నారని ఆరోపించారు. ఉపాధ్యాయులను బోధనేతర కార్యక్రమాల నుంచి మినహాయించి, బోధనకే పరిమితం చేయాలని డిమాండ్ చేశారు. 12వ పిఆర్‌సి కమిషన్ నియామకం, సిపిఎస్ రద్దు, 29శాతం ఐఆర్ అమలు, 2003 డిఎస్‌సి ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు తదితర ఉపాధ్యాయ సమస్యలపై ప్రభుత్వం స్పందించకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు, ప్రధాన కార్యదర్శి టిఆర్. అంబేద్కర్, గౌరవాధ్యక్షులు అనకాపల్లి పైడిరాజు, సహాధ్యక్షులు ఎన్. ప్రభాకర్, ఏ. విజయకుమారి, కోశాధికారి కె. రాంబాబు, జిల్లా కార్యదర్శులు చుక్క సత్యం, రిజ్వాన్, ఎం.రామకృష్ణ, రియాజ్ అహ్మద్, టి. జగన్, వంగా రామలక్ష్మి, ఆడిట్ కమిటీ కన్వీనర్ ఎం. రవిబాబు, పూర్వ ప్రధాన కార్యదర్శి టి. అప్పారావు, జెవివి రాష్ట్ర కార్యదర్శి వైఎఆర్‌కె ప్రసాద్ మహిళా ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సిపిఎస్ రద్దు చేయాలి.

గాజువాక : సిపిఎస్ విధానాన్ని రద్దుచేసి, పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహన్ అన్నారు. ఉపాధ్యాయ సమస్యలపై యుటిఎఫ్ రణభేరి ప్రచారజాతా ముగింపు సందర్భంగా గాజువాకలో మాట్లాడుతూ, ఎన్నికలకు ముందు ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను 15నెలలు గడిచినా కూటమి ప్రభుత్వం అమలు చేయడంలేదన్నారు. యుటిఎఫ్ రణభేరి జాతా ముగింపు సందర్భంగా ఈనెల 25న గుంటూరులో భారీ బహిరంగ జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యూనియన్. రాష్ట్ర కార్యదర్శి కిషోర్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే మరో పోరాటం తప్పదని హెచ్చరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు శ్రీలక్ష్మి, విజయ గౌరి, నాగమణి, దాసరి నాగేశ్వరరావు, ప్రసాద్, నూకరాజు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

జనవిజ్ఞాన వేదిక సంఘీభావం

యుటిఎఫ్ రణభేరి జాతాకు జనవిజ్ఞాన వేదిక విశాఖ జిల్లా కమిటీ సంఘీభావం తెలిపింది. గాజువాకలో ముగింపు కార్యక్రమంలో జెవివి జిల్లా కార్యదర్శి ఎస్‌వికె.పరశురాం పాల్గొని, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించి, ప్రభుత్వ విద్యను పరిరక్షించాలని కోరారు.

అనకాపల్లి : ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి రెడ్డి మోహన్‌రావు అన్నారు. అనకాపల్లి జిల్లాలో యుటిఎఫ్ రణభేరి కార్యక్రమం గురువారం రాత్రి స్థానిక సిఐటియు కార్యాలయం వద్ద ముగిసింది. ఇందులో పాల్గొన్న మోహన్‌రావు మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు సంబంధించిన 12వ పిఆర్సి కమిషన్ వెంటనే నియమించాలని, 29శాతం ఐఆర్ ప్రకటించాలని, పెండింగ్లో ఉన్న నాలుగు డీఏలను విడుదల చేయాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనులు రద్దు చేయాలని, ఓపిఎస్ అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి ఎస్.కిషోర్, జిల్లా అధ్యక్షులు వత్సవాయి శ్రీలక్ష్మి, ప్రధాన కార్యదర్శి గొంది చిన్నబ్బాయి, గౌరవాధ్యక్షులు పి.వెంకట్రావు, ఇతర నాయకులు పాల్గొన్నారు.

సిపిఎం నాయకులు మూర్తికి పితృ వియోగం



నివాళులర్పిస్తున్న శ్రీనివాసరావు, లోకనాథం, తదితరులు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : సిపిఎం భీమిలి జోన్ కార్యదర్శి, పార్టీ విశాఖ జిల్లా కమిటీ సభ్యులు ఆర్‌ఎస్‌ఎన్.మూర్తి తండ్రి సింహాద్రప్పడు (75) శుక్రవారం తెల్లవారుజామున 5:30 గంటలకు కెజిహెచ్‌లో కన్నుమూశారు. సింహాద్రప్పడు వ్యవసాయ పనుల్లో చురుగ్గా ఉండేవారు. 10 రోజులుగా కిడ్నీ, లివర్ వ్యాధితో కెజిహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి విషమించడంతో కన్నుమూశారు. విషయం తెలిసిన వెంటనే సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం, జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు కెజిహెచ్‌కు వెళ్లి, సిఎస్‌ఆర్ బ్లాక్ వద్ద ఉంచిన సింహాద్రప్పడు పార్థివ దేహాన్ని సందర్శించి నివాళ్లు అర్పించారు. మూర్తి కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. నివాళ్లర్పించిన వారిలో సిపిఎం, సిఐటియు నాయకులు ఆర్‌కెఎస్‌వి.కుమార్, వి.కృష్ణారావు, కెఎం.కుమార మంగళం, కె.చంద్రశేఖర్, ఎల్‌జె.నాయుడు తదితరులు ఉన్నారు. సింహాద్రప్పడు పెద్ద కుమారుడు మూర్తి సిపిఎం, సిఐటియుల్లో కీలక బాధ్యతల్లో ఉండగా, కోడలు లక్ష్మి అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలుగా ఉన్నారు.

స్వస్థ్ నారీ స్వశక్త్ అభియాన్‌పై అవగాహన

ప్రజాశక్తి- సీతమ్మధార :స్వస్థ్ నారీ స్వశక్త్ పరివార్ అభియాన్‌లో భాగంగా వైద్యఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో శుక్రవారం ఉదయం ఇండస్ట్రియల్ ఎస్టేట్‌లోని భవానీ గార్డెన్స్ పిహెచ్‌సిలో అవగాహనా ర్యాలీ నిర్వహించారు. ముఖ్యఅతిథి డిఎంహెచ్ఒ డాక్టర్‌పి. జగదీశ్వరరావు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పథకంతో మహిళలకు ల్యాబ్‌పరీక్షలతోపాటు వైద్యసేవలను ఉచితంగా అంద జేస్తారన్నారు. కేన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. గర్భిణులు, పిల్లలకు పౌష్టికాహారంపై వివరించారు. నోడల్ అధికారి డాక్టర్ హేమలత ఆధ్వర్యంలో వైద్యనిపుణులు, ఆరోగ్యసిబ్బంది, ఆశాలు పాల్గొన్నారు.



భవానీగార్డెన్ పిహెచ్‌సిలో నిర్వహిస్తున్న అవగాహనా ర్యాలీ

బాపూజీనగర్, స్వర్ణభారతి యుపిహెచ్‌సిల తనిఖీ

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ .పి.జగదీశ్వరరావు బాపూజీనగర్, స్వర్ణ భారతి యుపిహెచ్‌సిలను సందర్శించారు. పలు కేంద్ర, రాష్ట్ర వైద్యపథకాలపై పరిశీలనతోపాటు సమర్థవంతంగా అమలుకు తగు సూచనలు చేశారు. వచ్చేనెల 2 వరకు నిర్వహించే స్వస్థ్ నారీ స్వశక్త్ అభియాన్ వైద్యశిబిరాలను మహిళలను వినియోగించుకోవాలని సూచించారు. స్వర్ణభారతి యుపిహెచ్‌సిలో ఎఎన్‌ఎం అందించాల్సిన పలు నివేదికలు పెండింగ్‌లో ఉన్నాయని వాటిని రెండు రోజుల్లో అందజేయాలని వైద్యాధికారిని ఆదేశించారు.

తైక్వాండో పోటీల్లో ధనలక్ష్మి ప్రతిభ

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన కస్తూర్బా విద్యార్థిని



కె.ధనలక్ష్మి

ప్రజాశక్తి -ఆనందపురం: రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఆనందపురం కెజిబివి విద్యార్థిని ధనలక్ష్మి ఎంపికైంది. పరవాడ లోని ఎస్.వి.ఎస్. జూనియర్ కాలేజీలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ -19 తైక్వాండో పోటీల్లో ఆనందరపురం కస్తూర్బా ఇంటర్ ఫస్టియర్‌విద్యార్థిని కె. ధనలక్ష్మి ప్రతిభ కనబర్చి జిల్లా స్థాయిలో మొదటి స్థానంలో నిలిచి, రాష్ట్ర పోటీలకు అర్హత సాధించింది. దీనిపై ఎస్-ఎస్‌ఎ ఎపిసి చంద్రశేఖర్, జిసిడిఒ శ్రీదేవి, కస్తూర్బా ఎస్ఒ ఎస్. లావణ్య, ఎస్‌ఎంసి చైర్మన్ కోరుకొండ శివాజీ, వైస్‌చైర్మన్ మంగ అప్పన్న, కోఆప్షన్ సభ్యుడు బంగారు రాజు, దేవుడు బాబు తదితరులు ధనలక్ష్మితోపాటు, పిఇటి బండారు రమాదేవిని అభినందించారు.

గోల్డ్ లోన్ కస్టమర్ల కష్టాలు

ప్రజాశక్తి- ములగాడ: అత్యవసర నగదు అవసరాలకు బంగారం తాకట్టు పెట్టి బజాజ్ ఫైనాన్స్‌లో రుణాలు పొందిన వినియోగదారులు, తీరా బంగారంవిడిపించేందుకు ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. గాజువాక డిపో అభయాంజనేయ స్వామి గుడి ఎదురుగా ఉన్న బజాజ్ ఫైనాస్ గోల్డ్ లోన్ బ్రాంచ్‌లో కస్టమర్లకు అక్కడి బ్రాంచి మేనేజర్ కుమారి, సిబ్బంది రోజుల తరబడి అందుబాటులో లేకపోవడంతో తాకట్టు బంగారాన్ని విడిపించలేకపోతున్నామని వాపోతున్నారు. రోజువారీ వడ్డీకే కక్కుర్తిపడి ఇదంతా చేస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా బజాజ్ ఫైనాన్స్ యంత్రాంగం స్పందించి, బంగారం తాకట్టు విడిపించడానికి వచ్చిన వినియోగదారులకు సహకరించాలని కోరుతున్నారు.

దస్తావేజు లేఖర్ల పెన్‌డౌన్

నూతన రిజిస్ట్రేషన్ విధానంలో మార్పులు చేయాలని డిమాండ్



అనకాపల్లిలో ఆందోళన చేస్తున్న దస్తావేజు లేఖర్లు

ప్రజాశక్తి-అనకాపల్లి : ప్రభుత్వం రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా తీసుకువచ్చిన రిజిస్ట్రేషన్ విధానంలో మార్పులు చేయాలని కోరుతూ రాష్ట్రవ్యాప్త పిలుపులో భాగంగా దస్తావేజు లేఖరులు శుక్రవారం పెన్‌డౌన్ కార్యక్రమం నిర్వహించి, నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం అధ్యక్షులు శేష మాట్లాడుతూ ఆధార్ ఓటిపి, స్థానిక సంస్థల డేటాబేస్ ఆధారంగా ఇంటి ఆస్తుల రిజిస్ట్రేషన్, రిజిస్ట్రేషన్ శాఖకు సంబంధించి కార్డు ప్రైమ్, సాఫ్ట్వేర్‌లో సాంకేతిక లోపాల కారణంగా దస్తావేజు తయారీ కష్టతరమవుతుందని తెలిపారు. ప్రభుత్వం సానుకూలంగా స్పందించి నూతన విధానంలో దస్తావేజు తయారీకి ఇబ్బందులు లేకుండా మార్పులు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు గున్నయ్య, మధు, రవి, రామారావు, భవాని, శంకర్ గళ్ళ కొండలరావు, రామారావు, పోతురాజు, గణేష్, సత్య, హేమ, మహేష్, నూకరాజు, వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

చోడవరం : ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రైమ్ కార్డ్ 2.0తో అనేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చోడవరం దస్తావేజు లేఖరుల సంఘం అధ్యక్షుడు వడ్డాది రమేష్ అన్నారు. స్థానిక రిజిస్ట్రార్ కార్యాలయం ముందు దస్తావేజు లేఖర్లు శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ నూతన విధానంలో ఓటిపిల వల్ల, డాక్యుమెంట్ సబ్మిట్ చేసిన తరువాత ఎడిట్ ఆప్షన్ లేకపోవడం వలన ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఈ ఓటీపీ విధానం వల్ల అనేక సైబర్ నేరాలు జరిగే అవకాశం ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సీతారామయ్య, బొబ్బిలి చంద్రశేఖర్, శ్రీనివాసరావు, రామారావు, శ్రీనివాసరావు నారాయణరావు పాల్గొన్నారు.

నక్కపల్లి : రాష్ట్ర దస్తావేజు లేఖరుల సంఘం అధ్యక్షులు డి మురళీకృష్ణ ఆధ్వర్యంలో నక్కపల్లి లో సబ్ రిజిస్టర్ కార్యాలయం వద్ద శుక్రవారం దస్తావేజు లేఖరులు పెన్ డౌన్ చేపట్టారు. వీరికి వైసిపి నేత వీసం రామకృష్ణ, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎం అప్పలరాజు, మండల కార్యదర్శి ఎం రాజేష్ వైస్ ఎంపీపీ నానాజీ, సంఘీభావం తెలిపి, నిరసనలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో దస్తావేజుల సహాయకులు ఎన్‌వి రమణ, జీ.నూకరాజు, బి రాజు, కే సూర్యనారాయణ, వి లోకేష్, కెవిఆర్ చౌదరి,పి.లోవరత్నం, ఉపేంద్ర, గోవిందు, రమేష్, వరహాలు తదితరులు పాల్గొన్నారు

నర్సీపట్నంటౌన్ : స్థానిక సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద దస్తావేజు లేఖర్లు రెండు రోజుల పాటు పెన్‌డౌన్ కార్యక్రమం సంఘం అధ్యక్షులు. సున్నం చిదంబర స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు.

ఆనందపురం : రిజిస్ట్రేషన్ శాఖలో ఇటీవల ప్రవేశపెట్టిన ఆధార్ ఓటిపి, స్థానిక సంస్థల డేటాబేస్ ఆధారంగా ఆస్తుల రిజిస్ట్రేషన్లు, కార్డు ప్రైమ్ సాఫ్ట్‌వేర్‌లోని సాంకేతిక లోపాల వలన దస్తావేజుల తయారీ సమస్యలపై ఆనందపురం సబ్ రిజిస్ట్రేషన్ పరిధిలోని దస్తావేజు లేఖర్లు పెన్‌డౌన్ నిరసన చేపట్టారు. ప్రభుత్వం కొత్త విధానాలను పున్ణసమీక్షించి, సాంకేతిక లోపాలను తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.

భీమునిపట్నం : రిజిస్ట్రేషన్ శాఖలో నూతనంగా ప్రవేశ పెట్టిన కొన్ని విధానాలను వ్యతిరేకిస్తూ స్థానిక దస్తావేజు లేఖర్లు పెన్ డౌన్ నిరసన చేపట్టారు. దస్తావేజు లేఖర్లు లక్ష్మి, గోవింద్, సాయి, భాను, శ్రీనివాస్, సుబ్రమణ్యం పాల్గొన్నారు

విశాఖ కలెక్టరేట్ : రాష్ట్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొచ్చిన డేటాబేస్ రిజిస్ట్రేషన్ల విధానంలో మార్పులు చేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం టర్నర్ చౌల్ట్రీ వద్ద ఉన్న సబ్ రిజిస్టర్ కార్యాలయానికి ఎదురుగా దస్తావేజు లేఖర్లు సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో పెన్‌డౌన్ కార్యక్రమాన్ని నిర్వహించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు మజ్జి మురళీకృష్ణ మాట్లాడుతూ కార్డు ప్రైమ్ సాఫ్ట్‌వేర్‌లో సాంకేతిక లోపాల వల్ల దస్తావేజు తయారీ తీవ్ర జాప్యానికి గురవుతోందన్నారు.



ఆనందపురంలో నినాదాలు చేస్తున్న దస్తావేజు లేఖర్లు



భువనను అభినందిస్తున్న గురుకులం ప్రిన్సిపల్, పిఇటి

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు భువన ఎంపిక

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని తానాం మహాత్మ జ్యోతిరావు పూలే గురుకులంలో ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థిని ఆర్.భువన రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ (ఎస్‌జిఎఫ్) టోర్నమెంట్‌కు ఎంపికైంది. సెప్టెంబర్ 23 నుంచి 25 వరకు కర్నూలు జిల్లాలో జరగనున్న ఈ టోర్నమెంట్‌లో ఆడనున్నట్లు గురుకులం ప్రిన్సిపాల్ ఎంవైఎస్.సుహాసిని తెలిపారు. ఈ మేరకు శుక్రవారం భువనను అభినందించారు. రాష్ట్రస్థాయిలో రాణించి జాతీయ స్థాయి పోటీలకు వెళ్లాలని, ఆకాంక్షించారు. కార్యక్రమంలో పిఇటి ఎస్.గౌరీ, గురుకులం ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సిసి రోడ్డు నిర్మాణ పనులు ప్రారంభం

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని పెదముషిడివాడ గ్రామంలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను శుక్రవారం సర్పంచ్ నాగమణి ప్రారంభించారు. రూ.5 లక్షల పంచాయతీ నిధులతో ఈ పనులు చేపట్టినట్లు సర్పంచ్ తెలిపారు. కార్యక్రమంలో వార్డ్ మెంబర్లు యలమర్తి బుజ్జి, పల్లా వెంకటలక్ష్మి, సీర పైడమ్మ, వైసిపి నాయకులు పల్లా అప్పారావు, కలవాలపల్లి సత్యనారాయణ, బర్ల వెంకునాయుడు, పల్లా వెంకునాయుడు, దళిబోయిన పైడిరాజు, బోడి నాగేష్ పాల్గొన్నారు.

రేపు మెగా రక్తదాన శిబిరం

ప్రజాశక్తి-యలమంచిలి : సంకల్ప సేవా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 21న ఆదివారం స్థానిక కొత్తపేట అయ్యప్ప దేవాలయం వెనుక బుజ్జి కూరగాయల దుకాణం దగ్గర మెగా రక్తదాన శిబిరం ఏర్పాటు చేసినట్లు నిర్వహకులు గొలుసుపూడి శ్రీనివాసబుజ్జి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రక్తదానం శిబిరంలో పాల్గొనే వారికి కడియం నుండి రప్పించిన విలువైన మొక్కలు ఉచితంగా పంపిణీ చేస్తామని పేర్కొన్నారు. పట్టణంలోని రక్తదాతలంతా శిబిరంలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

బిల్లులు, వేతన బకాయిలు చెల్లించాలి

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని వాడచీపురుపల్లి హైస్కూల్‌లో 430 మంది విద్యార్థులకు మధ్యాహ్నం భోజనం వండి పెడుతున్న కార్మికులకు జూన్, జూలై, ఆగస్టు మూడు నెలల బిల్లులు, జీతాల బకాయిలు తక్షణమే చెల్లించాలని కోరుతూ ఎపి మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ (సిఐటియు) ఆధ్వర్యాన శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ మండల కార్యదర్శి కె.ఆదిలక్ష్మి మాట్లాడుతూ ప్రస్తుతం సెప్టెంబర్ నెల నడుస్తున్నా ఇంత వరకు బిల్లులు, వేతనాలు చెల్లించకపోవడంతో తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు చెప్పారు. కూటమి ప్రభుత్వం వేతనం రూ.10వేలుకు పెరుగుతుందని ఆశించామని, కాని బిల్లులు, వేతనాలే సకాలంలో ఇవ్వడం లేదని పేర్కొన్నారు. ధరలు ఆకాశాన్ని తాకుతున్న నేపథ్యంలో వందలాది మంది విద్యార్థులకు తమ సొంత డబ్బులతో సరుకులు కొని వండి పెట్టడం చాలా కష్టంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. యూనియన్ మండల గౌరవాధ్యక్షులు పి.మాణిక్యం మాట్లాడుతూ కార్మికుల పరిస్థితిని వెంటనే ప్రభుత్వం సీరియస్‌గా పరిగణించి, బిల్లులు విడుదల చేసి, జీతాలు పెంచాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు కె.లక్ష్మి నాగమణి, సత్యవతి, రత్నకుమారి, పైడితల్లి, నూకరత్నం, జి.లక్ష్మి, అనిత, పార్వతమ్మ, దేవి, వెంకటలక్ష్మి, రత్నం తదితరులు పాల్గొన్నారు.



నినాదాలు చేస్తున్న మిడ్డేమీల్స్ కార్మికులు

భూమి కోల్పోయిన వారికి ఉద్యోగాలివ్వాలి



అసెంబ్లీలో మాట్లాడుతున్న కొణతాల

ప్రజాశక్తి-అనకాపల్లి : పరిశ్రమల పేరుతో చేపడుతున్న భూ సేకరణలో భూములు ఇచ్చి సర్వం కోల్పోయిన నిర్వాసితులకు ఆయా పరిశ్రమల్లో ఉద్యోగాలు ఇవ్వాలని అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ శుక్రవారం అసెంబ్లీలో ప్రస్తావించారు. భూముల ధరలు కోట్ల రూపాయలు పెరిగినప్పటికీ భూమి కోల్పోయిన రైతులకు కనీసం ఒక ఉద్యోగం కూడా పరిశ్రమ యాజమాన్యాలు ఇవ్వకపోవడం దురదృష్టకరమన్నారు. ఈ పరిస్థితిని సవరించి ఒక నిర్దిష్టమైన విధి విధానాలు అవసరమని పేర్కొన్నారు. భూమి కోల్పోయిన కుటుంబానికి ఒక ఉద్యోగం తప్పనిసరి ఇచ్చే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. భూములు తీసుకొని ఎటువంటి పరిశ్రమ నిర్మాణం చేపట్టలేదని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. దీనిపై మంత్రి టీజీ భరత్ వివరణ ఇస్తూ... అగ్రిమెంట్ ప్రకారం నిర్మాణం చేపట్టిన పక్షంలో వారికి నోటీస్ పంపి వెనక్కి తీసుకునే విధంగా చర్యలు తీసుకుంటామని చెప్పారు. పరిశ్రమంల్లో ఉద్యోగాలు కల్పించేందుకు పరిశ్రమల ద్వారానే ఆయా ప్రాంతంలో స్కిల్ డెవలప్మెంట్ కేంద్రాల ఏర్పాటు చేసి, శిక్షణ ఇచ్చి ఉద్యోగులు కల్పించే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

యూరియా పంపిణీ పరిశీలన

ప్రజాశక్తి-యస్.రాయవరం : మండలంలోని గెడ్డపాలెం, దార్లపూడి గ్రామాలలో యూరియా పంపిణీ కార్యక్రమాన్ని జిల్లా వ్యవసాయ అధికారి బి మోహన్ రావు శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ యూరియ కోసం రైతులు ఎవరూ ఆందోళన చెందవలసిన అవసరం లేదని తెలపారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి సౌజన్య, ఎరకయ్య, వీఆర్వోలు, రైతులు పాల్గొన్నారు.

స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ

ప్రజాశక్తి- పాయకరావుపేట : స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని స్టేట్ సివిల్ సప్లయ్ కార్పొరేషన్ డైరెక్టరు బోడపాటి శివదత్ పాయకరావుపేట తహాశీల్దారు కార్యాలయం వద్ద శుక్రవారం ప్రారంభించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు చించలపు ప్రదీప్ (పద్దు), యాళ్ల వరహాలబాబు, తోట నగేష్, పెదిరెడ్డి చిట్టిబాబు, పిఎసిఎస్ ఛైర్మన్లు దేవవరపు రాజుబాబు, చిక్కాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

తిమిరాం సంత కిటకిట

- దసరా దగ్గర పడడంతో పెద్ద సంఖ్యలో మేకలు, గొర్రెలు, కోళ్లు కొనుగోలు

- ఆశీలు లేకపోవడంతో అమ్మకందారులకు ఊరట



తిమిరాం సంతకు మేకలు, గొర్రెలతో పెద్ద సంఖ్యలో తరలివచ్చిన జనం

ప్రజాశక్తి-దేవరాపల్లి : దేవరపల్లి మండలం తిమిరాంలో శుక్రవారం వారపు సంత కొనుగోలు, అమ్మకందారులతో కిటకిటలాడింది. దసరా దగ్గర పడడంతో మేకలు, గొర్రెలు, నాటు కోళ్ల విక్రయం పెద్ద మొత్తంలో జరిగింది. వందేళ్లకుపైగా చరిత్ర కలిగిన ఈ సంతలో నేటికీ ఆశీలు వసూలు చేయరు. అందుకే రైతులు, పశువుల యజమానులు ఇక్కడికి రావడానికి ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. ఒకప్పుడు ఈ సంతలో వజ్రాలు, వైడూర్యాలు, బంగారు వస్తువులు కూడా అమ్మేవారని గ్రామ పెద్దలు చెబుతున్నారు. ఇప్పుడు బంగారం, వెండి అమ్మకాలు లేనప్పటికీ చిరుధాన్యాలు, పశువులు, మేకలు, గొర్రెలు, నాటు కోళ్ళ, వివిధ జాతుల కోడి పిల్లలు, మంచాలు, నాగళ్ళు, బట్టలు, తినుబండారాలు, ఇతర గృహావసరాలకు కావలసిన ప్రతి వస్తువు ఇక్కడ దొరుకుతుంది. ఈ సంతకు విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం, శ్రీకాకుళం, తూర్పు గోదావరి జిల్లాల నుండి రైతులు, కొనుగోలుదారులు వస్తున్నారు. దసరా పండగ దగ్గర పడడంతో ఈ వారం నాటు కోళ్ల, మేకలు, గొర్రెల అమ్మకాలు పెద్ద మొత్తంలో జరిగాయి. అంతే కాకుండా ఈ వారం పశువుల విక్రయం కూడా ఎక్కువగా జరిగింది. దీంతో గ్రామం మొత్తం పండుగ వాతావరణాన్ని తలపించింది. ప్రతి వారం కోటి రూపాయలకు పైగా ఇక్కడ వ్యాపారం జరుగుతుంది. ఈ సంత వల్లే తిమిరాం గ్రామానికి జిల్లా మ్యాప్‌లో ప్రత్యేక గుర్తింపు వచ్చింది.

స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : పెండింగ్లో ఉన్న స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని కోరుతూ శుక్రవారం ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో అనకాపల్లి ఆర్డీవో కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. ఈ సందర్భంగా సంఘం ఏఐఎస్‌ఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదన్ములు బి.బాబ్జి, జి.జీ.ఫణీంద్ర కుమార్ మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా రూ.6400 కోట్లు స్కాలర్ షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయి ఉందని, దీని వల్ల చాలామంది విద్యార్థులు చదువులు పూర్తి చేసుకున్న పట్టా చేతికి రాని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. పిపిపి విధానంలో 17 మెడికల్ కళాశాలలను ప్రైవేటీకరణ చేయాలనే ఆలోచన విరమించుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర శాసన సభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర మంత్రి అనిత, అనకాపల్లి ఎంపీ సిఎం.రమేష్ నర్సీపట్నం మెడికల్ కళాశాలను ప్రభుత్వ రంగంలో నిర్మించకపోవడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు ఏ జగదీష్, సింహాద్రి, రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.



భూ పూజ చేస్తున్న సర్పంచ్ గంగ అప్పలనాయుడు

కుళాయి పైపులైన్ పనులకు భూమి పూజ

ప్రజాశక్తి-మునగపాక : మండలంలోని మూలపేట గ్రామంలో కుళాయి పైపులైన్ పనులకు సర్పంచ్ భీశెట్టి గంగ అప్పలనాయుడు శుక్రవారం భూమి పూజ చేసి పనులు ప్రారంభించారు. 15వ ఆర్థిక సంఘం నిధులతో ఈ పనులు చేస్తున్నట్లు ఆయన చెప్పారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీ మొల్లేటి గంగాధర్, వార్డు మెంబర్లు ఎల్లపు హైమవతి నాయుడు, భీశెట్టి నారాయణమూర్తి, ఆడారి సత్యనారాయణ, ఆడారి సన్యాసినాయుడు, మొల్లేటి గోవిందరావు, కూటమి నాయకులు ఎల్లపు రాజేశ్వరరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయ సాధనకు కృషి

దేవరాపల్లి : బాబాసాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధన కోసం ఎస్సీ, ఎస్టీ, బీసీలంతా ఐక్యంగా ముందుకు సాగాలని అంబేద్కర్ ఆశయ సాధన సంఘం మండల అధ్యక్షులు కాటపల్లి అప్పారావు పిలుపునిచ్చారు. స్థానిక రైవాడ అతిథి గృహం వద్ద శుక్రవారం జరిగిన సంఘం మండల కమిటీ సమావేశంలో అప్పారావు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ చేయడం వలన డీఎస్సీ 2025లో ఎస్సీ యువకులు వందల సంఖ్యలో ఉద్యోగ అవకాశాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్లి సాయిసుందరరావు, పతివాడ నాగభూషణం, సబ్బవరపు మాలిబాబు, కంచిమాల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

డైట్‌లో స్మార్ట్ ఇండియా హ్యాకథాన్-2025

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక డైట్ ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం స్మార్ట్ ఇండియా హ్యాకథాన్ 2025కు సంబంధించిన ఇంటర్నల్ రౌండ్ నిర్వహించారు. 20 జట్లు తమ వినూత్న ఆలోచనలు, ప్రాజెక్ట్ ప్రతిపాదనలు సమర్పించాయి. విద్యార్థులు ప్రస్తుత సాంకేతిక సవాళ్లకు పరిష్కారాలు సూచిస్తూ తమ ప్రతిభను ప్రదర్శించారు. ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్.వైకుంఠరావు, డీన్ అకడమిక్స్ డాక్టర్ వి. వెంకట ఫణిబాబు, డీన్ ఆర్ అండ్ డి డాక్టర్ ఎస్.రమణ కుమార్ జోగ, విభాగాధిపతులు హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు. కళాశాల అధ్యక్షులు దాడి రత్నాకర్ టాప్ రెండు జట్లను అభినందిస్తూ, వారు దేశస్థాయి హ్యాకథాన్‌లో విజయం సాధించాలని ఆకాంక్షించారు.

క్రీడా పోటీలకు విద్యార్థులను ఎంపిక చేయాలి

ప్రజాశక్తి-కె.కోటపాడు : అక్టోబర్లో నిర్వహిస్తున్న మండల స్థాయి క్రీడా పోటీలకు బాలబాలికలను ఎంపిక చేయాలని స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్ ప్రధానోపాధ్యాయురాలు ఎస్వీ పద్మావతి సూచించారు. శుక్రవారం స్కూలు గేమ్స్ ఫెడరేషన్ సమావేశం జరిగింది. ఇందులో మండలంలోని అన్ని పాఠశాలల హెచ్‌ఎంలు, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ అండర్-14, అండర్-17 బాల బాలికల టోర్నమెంట్ సెలక్షన్స్ త్వరగా చేపట్టాలన్నారు. అక్టోబర్ 4వ తేదీన బాలికలకు, అక్టోబర్ 6న తేదీన బాలురకు పోటీలు ఏర్పాటు చేయడానికి సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ప్రధానంగా కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్, యోగా అథ్లెటిక్స్ పోటీలు నిర్వహించడం జరుగుతుందని హెచ్‌ఎం పద్మావతి తెలిపారు.

అర్హులకు టిడ్కో గృహాలు కేటాయిస్తాం

ప్రజాశక్తి-అనకాపల్లి రూరల్ : టిడ్కో గృహాలను ప్రభుత్వానికి డిడి కట్టిన అర్హులైన లబ్ధిదారులకు కేటాయిస్తామని రాష్ట్ర అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పీలా గోవింద సత్యనారాయణ పేర్కొన్నారు. టిడిపి కార్యాలయంలో శుక్రవారం గ్రీవెన్స్ సెల్ నిర్వహించారు. రాష్ట్ర ఎస్‌సి కార్పొరేషన్ డైరెక్టర్ సబ్బవరపు గణేష్‌తో కలిసి టిడిపి శ్రేణులు, ప్రజల నుండి వినతులు స్వీకరించారు. రజకులకు దోబీ ఘాట్‌లు నిర్మించాలని విన్నవించారు. పెండింగ్ బిల్లుల సమస్యను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. ఈ కార్యక్రమంలో టిడిపి కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు.



వినతిపత్రం స్వీకరిస్తున్న పీలా గోవింద సత్యనారాయణ

బాబోయ్.. సైకిల్ దొంగలు

- నునపర్తి జంక్షన్ వద్ద విద్యార్థుల సైకిళ్ల అపహరణ
- పోలీసుల నిఘా, సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని వేడుకోలు



నునపర్తి జంక్షన్‌లో పార్కు చేసిన సైకిళ్లు

ప్రజాశక్తి-పరవాడ : మండలంలోని రావాడ పంచాయతీ పరిధి నునపర్తి జంక్షన్‌లో విద్యార్థుల సైకిళ్లను దొంగలు అపహరించుకుపోతున్నారు. ప్రతి రోజూ గొల్లగుంట, రేఖవానిపాలెం, గొల్లగరువు, ఎన్టీఆర్ కాలనీ తదితర ప్రాంతాల నుండి విద్యార్థులు సైకిళ్లపై వచ్చి నునపర్తి జంక్షన్‌లో పెట్టి బస్సుల్లో కళాశాలలకు వెళ్తుంటారు. ఇటీవల సైకిల్ దొంగతనాలు పెరగడంతో విద్యార్థులు, వారి తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శుక్రవారం గొల్లగుంట గ్రామానికి చెందిన బషీర్ అనే విద్యార్థి (పరవాడ ప్రభుత్వ జూనియర్ కళాశాల, ఇంటర్ ద్వితీయ సంవత్సరం) నునపర్తి జంక్షన్ వద్ద ఉదయం సైకిల్ పార్క్ చేసి కళాశాలకు వెళ్లగా, సాయంత్రం తిరిగి వచ్చేసరికి సైకిల్ మాయం కావడంతో కంటతడి పెట్టుకున్నాడు. అలాగే రెండువారాల క్రితం గొల్లగుంట గ్రామానికి చెందిన సబాన్ బేగం సైకిల్, ఆరు నెలల క్రితం దిల్షాద్ బేగం సైకిల్ కూడా దొంగలు అపహరించుకుపోయారు. ఇదే తరహాలో మరికొంత మంది సైకిళ్లు, ద్విచక్ర వాహనాలు కూడా అపహరణకు గురైనట్లు బాధితులు చెబుతున్నారు. బస్ స్టాప్‌కు తమ గ్రామానికి దూరం కావడంతో సైకిళ్లపై ఇక్కడికి వచ్చి బస్సు ఎక్కుతున్నారు. ఇలా పార్కు చేసిన సైకిళ్ల మాయం కావడంతో ఏమి చేయాలో అర్థం కాక విద్యార్థులు సతమతమవుతున్నారు. నునపర్తి జంక్షన్‌లో సీసీ కెమెరాలు అమర్చకపోతే పరిస్థితి మరింత దిగజారుతుంది. విద్యార్థుల సైకిళ్లకు రక్షణ లేకుండా పోతుంది. ఇప్పటికైనా పోలీసు అధికారులు స్పందించి నునపర్తి జంక్షన్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని, నిఘా పెంచాలని ఆయా గ్రామాల విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.

కేబుల్ వైర్ సహాయంతో వాగు దాటిన మహిళ



కేబుల్ సహాయంతో వాగు దాటుతున్న మహిళ

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : మండలంలోని విజయరామరాజుపేట వద్ద తాచేరు కాజ్‌వే కొట్టుకుపోయిన ప్రదేశంలో ఒకవైపు ఒడ్డున ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు.. మరోవైపు ఒడ్డున అధికారులు ఉండగా, శుక్రవారం ఒక మహిళ కేబుల్ సహాయంతో నది దాటడం ఈ ప్రాంత ప్రజలు పడుతున్న ఇబ్బందులు ప్రజా ప్రతినిధులకు, అధికారులకు కళ్లకు కట్టినట్లయింది. నెల రోజుల క్రితం కొట్టుకుపోయిన తాచేరు కాజ్‌వేను పరిశీలించడానికి ఆర్ అండ్ బి అధికారులు చోడవరం నుండి విజయరామరాజుపేట వైపు వచ్చారు. ఈ ప్రాంతంలో ప్రయాణికులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను వివరించడానికి టిడిపి మండల నాయకులు, ప్రజాప్రతినిధులు వడ్డాది వైపు నుండి కాజువే కొట్టుకుపోయిన ప్రదేశానికి చేరుకున్నారు. అవతల వైపున అధికారులు, ఇతర వైపున ప్రజాప్రతినిధులు నిలబడి ఉండగా, ఇదేమీ పట్టనట్లు విజయరామరాజుపేటకు చెందిన ఒక మహిళ వడ్డాది వచ్చి తమ పనులు చూసుకుని విజయరామరాజుపేట వెళ్లడానికి ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులో దిగి టెలిఫోన్ కేబుల్ సాయంతో అవతల ఒడ్డుకు చేరుకుంది. ఈ సమయంలో ప్రజా ప్రతినిధులు ఆర్ అండ్ బి డీఈకి ఫోన్ చేసి ప్రజలు ఏ విధంగా ఇబ్బందులు పడుతున్నారో చూసి పనులను సత్వరమే పూర్తి చేయాలని కోరారు.

పోషకాహారంపై అవగాహన



కె.కోటపాడులో ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

ప్రజాశక్తి-కె.కోటపాడు : పిల్లలు ఆరోగ్యం, మహిళల పోషకాహారంపై అవగాహన పెంపొందించేందుకు మండల కేంద్రంలోని 5వ అంగన్వాడీ కేంద్రంలో ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎల్‌బి సుశీల ఆధ్వర్యంలో శుక్రవారం పోషణ మాసోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గర్భిణులు, మహిళలకు సమతుల ఆహారం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సూపర్వైజర్లు, అనిత, ఆదిలక్ష్మి, అంగన్వాడీ కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

దేవరాపల్లి : మండలంలోని చింతలపూడి గ్రామ సచివాలయంలో ఐసిడిఎస్ ప్రాజెక్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం పోషణ మాసోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారి పూజ మేఘన, తామరబ్బ సర్పంచ్ రామకృష్ణ, ఐసిడిఎస్ సూపర్వైజర్, అంగన్వాడి వర్కర్లు, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

గొలుగొండ : మండలంలోని సీహెచ్.ఎర్రవరం అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం పోషకాహార మాసోత్సవ కార్యక్రమంలో భాగంగా గర్భిణీలు, బాలింతలకు పౌష్టికాహారం, ఆరోగ్య పరిరక్షణపై అవగాహన కల్పించారు. పౌష్టికాహార స్టాల్ను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ రాఘవ, అంగన్వాడీలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు. గొలుగొండ అంగన్వాడీ కేంద్రం-1లో జరిగిన పోషకాహార మాసోత్సవాల్లో అంగన్వాడీ రమణమ్మ, జనసేన నేత బోయిన చిరంజీవి పాల్గొన్నారు.

పద్మనాభం : మండలంలోని పెంట గ్రామంలో ఐసిడిఎస్ ఆధ్వర్యంలో పోషణ మాసోత్సవాలను నిర్వహించారు. పెంట గ్రామ సర్పంచ్ బి పావని, సిడిపిఒ ఎం. శ్రీదేవి, వైద్యాధికారి డాక్టర్ లీలా ప్రసాదు, ఐసిడిఎస్ సూపర్వైజర్ ఎస్‌వి.పార్వతి, అంగన్వాడీ కార్యకర్తలు జెవి నారాయణమ్మ, పి పార్వతి, ఎస్ లక్ష్మి, జి మోహిని కుమారి పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఆర్ అండ్ బి చీఫ్ ఇంజనీర్

బిఎన్ రోడ్డు పరిశీలన

ప్రజాశక్తి వడ్డాది : రాష్ట్ర రహదారులు భవనాల శాఖ చీఫ్ ఇంజనీర్ (ఎన్డీబీ వర్క్స్) వికె.విజయశ్రీ శుక్రవారం బిఎన్ రోడ్డును పరిశీలించారు. ఎన్డీబీలో నిధులు మంజూరైనప్పటికీ బిఎన్ రోడ్డు విస్తరణ పనులు ప్రారంభించకపోవడంపై చోడవరం సబ్ కోర్టులో న్యాయవాదులు ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం వేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో సీఈ విజయశ్రీ గంధవరం నుండి రోలుగుంట వరకు బిఎన్ రోడ్డును, శిథిలమైన వడ్డాది, విజయరామరాజు పేట వంతెనలను పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజాప్రతినిధులు నాయకులు రోడ్డు, వంతెనల దుస్థితిని, ప్రజల రవాణా కష్టాలను ఆమెకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఎన్డీబీ నిధులతో బిఎన్ రోడ్డు మరమ్మతులు తక్షణమే ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ అండ్ బి ఈఈ సాంబశివరావు, అనకాపల్లి, నర్సీపట్నం డివిజన్ల డిఈలు కేఎస్ ప్రభు, విద్యాసాగర్, జేఈలు పి.సత్య ప్రసాద్, సాయి శ్రీనివాస్, కూటమి నేతలు గేదెల సత్యనారాయణ, ఎంవివి సత్యనారాయణ, దొడ్డి కిషోర్, దొండా సన్యాసిరావు, శిరిగిరిశెట్టి శ్రీరామ్మూర్తి, దొండా గిరిబాబు, కోరుకొండ సూరప్పారావు తదితరులు పాల్గొన్నారు.

జివిఎంసి స్థలాన్ని పరిరక్షించాలి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి పట్టణ నడిబొడ్డులో ఉన్న కోట్లాది రూపాయలు విలువచేసే జీవీఎంసీ స్థలాన్ని పరిరక్షించాలని కోరుతూ శుక్రవారం జోనల్ కమిషనర్‌కు సిపిఐ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ స్థానిక పోలీస్ స్టేషన్ పక్కన సర్వేనెంబర్ 813 గల ఠాణా స్థలాన్ని గతంలో కొంతమంది ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టడానికి పూనుకుంటే తాము నాడు ఫిర్యాదు చేశామని, దీంతో నాడు హెచ్చరిక బోర్డులు పెట్టారని తెలిపారు. కొద్ది రోజులుగా ఆ స్థలంలో ఎగ్జిబిషన్ ఏర్పాట్లు పనులు ముమ్మరంగా జరుగుతున్నాయని, కోట్ల విలువ చేసే ఈ స్థలాన్ని కాపాడవలసిన బాధ్యత అధికారులపై ఉందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు వైఎన్ భద్రం, కోరుబిల్లి శంకర్రావు, కరణం మాణిక్యాలరావు, మత్తుర్తి సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

పనిముట్ల చోరీపై ఫిర్యాదు

ప్రజాశక్తి-మునగపాక : తమ పనిముట్లు చోరీపై విచారణ చేపట్టాలని స్థానిక దానయ్య గారి మూల సంఘం రైతులు స్థానిక పోలీస్ స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ బుధవారం రాత్రి పనులు ముగించుకొని తమ ఇళ్లకు వెళ్లిన అనంతరం తమ పొలం పనులకు వాడుకున్న గుణపము, పారా, గొడ్డలి, కత్తులు, కొడవళ్ళు, పంపులు తదితర వస్తువులతో పాటుగా పాకలో ఉన్న సైకిల్‌ను కూడా అపహరించుకుపోయారని తెలిపారు. దీనిపై పోలీసు అధికారులు విచారణ జరిపి తమకు న్యాయం చేయాలని కోరారు. గ్రామ రైతు సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఆడారి మహేష్, దాడి శివ, ఆడారి లక్ష్మణరావు, బాధిత రైతులు ఆడారి గోవిందా, అప్పారావు, రమణబాబు, సూరి అప్పారావు, వేగి రమణబాబు, ఆడారి నర్సింగరావు, వేగి గంగ సూరి అప్పారావు, వేగి సత్యనారాయణ పాల్గొన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు మందుల పంపిణీ

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి మండలంలోని కిడ్నీ వ్యాధి ప్రభావిత గ్రామాల్లోనూ, రెండో సారి ఎన్టీఆర్ హాస్పిటల్‌లో కిడ్నీ సంబంధిత స్క్రీనింగ్ పరీక్షలు నిర్వహించిన వారికి స్థానిక ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ సొంత నిధులతో మందులను కొనుగోలు చేసి శుక్రవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపిటిసి చదరం నాగేశ్వరరావు, కూటమి నాయకులు బంటు రవి, గంగుపాం జగదీష్, రొంగలివానిపాలెం సూరిబాబు, రామకృష్ణ జ్యోతులు గణేష్, లక్ష్మీనారాయణ, పాల్గొన్నారు.

ఎంపిడిఒకు సన్మానం

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట నూతన ఎంపీడీవోగా విధుల్లో చేరిన శివప్రసాద్‌ను వైసీపీ ప్రజాప్రతినిధులు, నాయకులు శుక్రవారం కలిసి సాలువతో సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ దొండా రాంబాబు, వైస్ ఎంపీపీలు నారాయణ మూర్తి, జి.చినబాబు, సర్పంచులు గోపిశెట్టి శ్రీనివాసరావు, వై.విజయ్ కుమార్, ఎం.అప్పారావు, పి.మాణిక్యం, ఎం శ్రీను, డిసిసిబి మాజీ డైరెక్టర్ కోవెల జనార్దన్, వైసిపి మండల మాజీ అధ్యక్షులు జోగా కొండబాబు, తదితరులు పాల్గొన్నారు.

బిఎన్ రోడ్డు మరమ్మతులు చేయలేం

- చీఫ్ ఇంజినీర్ ముందే చేతులెత్తేసిన కాంట్రాక్టర్



పరిశీలిస్తున్న చీఫ్ ఇంజినీర్

ప్రజాశక్తి-కొత్తకోట:భీమునిపట్నం - నర్సీపట్నం (బియన్) రోడ్డు మరమ్మతులు ఇక చేయలేమని రాష్ట్ర రోడ్లు భవనాలు శాఖ చీఫ్ ఇంజనీర్ విజయశ్రీ ముందే కాంట్రాక్టర్ తేల్చి చెప్పేసారు. న్యూ డెవలప్మెంట్ బ్యాంక్ నిధులతో చేపట్టిన నర్సీపట్నం - చోడవరం నిర్మాణంలో ఉన్న రోడ్ల స్థితి ని శుక్రవారం కొత్తకోట, గర్జికం, మేడివాడ తదితర గ్రామాలలో బియన్ రోడ్డుపై ఏర్పడ్డ భారీ గుంతలు ను పరిశీలించారు. ఈ సందర్బంగా బి ఎన్ రోడ్డు లో ఏర్పడిన గుంతలను తక్షణం మరమ్మతులు చేయాలని మండల టిడిపి అధ్యక్షులు కోమటి శంకరరావు, నాయకులు రాజాన కొండనాయుడు, గొర్ల సాంబశివ, వజ్రపు వెంకట నర సింహమూర్తి, గోకివాడ రమణ తదితరులు కోరడంతో ఆమె స్పందించారు. ద్విచక్ర వాహనదారులు ఈ గుంతల్లో పడి ప్రమాదానికి గురవుతున్నారని, భారీ వాహనాలు కూరుకుపోయి ట్రాఫిక్ అంతరాయం కలుగుతుందని చీఫ్ ఇంజనీర్ విజయశ్రీ దృష్టికి తెచ్చారు. ఈ నేపథ్యంలో ఆమె వెంట ఉన్న కాంట్రాక్టర్ వెంకటేశ్వరరావును తక్షణం ఈ గుంతల ను పూడ్చాలని ఆదేశించారు. ఈ రోడ్డు నిర్మాణానికి మూడేళ్ల క్రితం ఖర్చుపెట్టిన 10 కోట్ల రూపాయలు లో ఇంతవరకు ఒక రూపాయి కూడా రాష్ట్ర ప్రభుత్వం చెల్లించలేదని, ఇకపై పనులు చేయలేమని కాంట్రాక్టర్ స్పష్టం చేశారు. ఈ సమాధానానికి మండిపడ్డ ఆమె పనులు చేయని యెడల కాంట్రాక్ట్ రద్దు చేసుకోవాలని సూచించారు. అనంతరం విలేఖరులతో ఆమె మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా న్యూ డెవలప్మెంట్ బ్యాంక్ నిధులతో నిర్మాణంలో ఉన్న. పనులకు సుమారు రూ.130 కోట్ల వరకు బకాయిలు ఉన్న మాట వాస్తవమేనన్నా రు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లి నిధులు విడుదలకు కృషి చేస్తామన్నారు. అప్పటి వరకు రోడ్డుపై ఏర్పడ్డ గుంతలు తాత్కాలిక మరమ్మతులు చేయాలని కాంట్రాక్టర్లను కోరామన్నా రు. ఈ కార్యక్రమంలో పలువురు ఆర్ అండ్ బి అధికారులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న యామిని

చిరు వ్యాపారులకు గుర్తింపు కార్డులు తప్పనిసరి

ప్రజాశక్తి -నక్కపల్లి:ఎంఎస్ఎంఈ ద్వారా చిరు వ్యాపారాలు సాగిస్తున్న వారందరూ తప్పనిసరిగా ఉద్యమ ఆధార్ కార్డు (గుర్తింపు కార్డులు) నమోదు చేసుకోవాలని జిల్లా పరిశ్రమల శాఖ అధికారి యామిని అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో చిరు వ్యాపారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. చిరు వ్యాపారవేత్తలకు గుర్తింపు కార్డులు తప్పనిసరి అని ఆమె అన్నారు. అనంతరం వ్యాపారులకు గుర్తింపు కార్డు కోసం రిజిస్ట్రేషన్లు చేశారు. ఏపీఎం శ్రీనివాస్ మాట్లాడుతూ మండలంలో ఎంఎస్ఎంఈ ద్వారా 92 చిరు వ్యాపారులకు ఒక్కొక్కరికి 40 వేల రూపాయలు చొప్పున ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో సీసీలు రాజు, సన్యాసిరావు, దేవినమ్మ, నాగప్రసాద్, అప్పారావు, ఎఫ్ పి ఓ సి సి శ్రీను పాల్గొన్నారు.

మెడికల్ కాలేజీలను ప్రభుత్వమే నిర్వహించాలి

- వైసిపి నేతల పాదయాత్ర - అడ్డుకున్న పోలీసులు



పాదయాత్ర చేపడుతున్న నేతలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్: మెడికల్ కళాశాలలను పిపిపీ పద్ధతిలో నిర్మాణాలు చేపట్టడానికి కూటమి ప్రభుత్వం చూస్తుందని, పేదలకు వైద్యం దూరం చేయాలనే ఉద్దేశంతోనే ఈ ఆలోచన చేస్తుందని మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ శుక్రవారం తెలిపారు. మాజీ ఎమ్మెల్యే గణేష్ వైసిపి క్యాంపు కార్యాలయం నుండి చలో మెడికల్ కాలేజీ పాదయాత్ర కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నిర్మాణం జరుగుతున్న మెడికల్ కాలేజీని శుక్రవారం పరిశీలించారు. ఇప్పటికే సుమారు 60 శాతం పనులు పూర్తి అయ్యాయన్నారు.కూటమి ప్రభుత్వ నాయకులు ఈ ప్రాజెక్టును విస్మరించడం విచారకరమని వారు పేర్కొన్నారు. ఈ మెడికల్ కాలేజీకి నాటి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం 500 కోట్ల రూపాయల భారీ బడ్జెట్ను కేటాయించి, 630 పడకల సామర్థ్యంతో ప్రాజెక్టును ప్రారంభించిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం ప్రజా ప్రయోజనాల కంటే ప్రైవేటు లాబీలను ప్రోత్సహించే విధంగా వ్యవహరిస్తోందని వారు ఆరోపించారు. ఇలాంటి ప్రాజెక్టులను పెత్తందారులకు అప్పగించకుండా, ప్రభుత్వమే నిర్వహణ బాధ్యతలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మెడికల్ కాలేజీకి చేరుకునే వైసీపీ నాయకుల పాదయాత్రను పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేయడంతో అక్కడ ఉద్రిక్తత నెలకొంది. వైసిపి కౌన్సిలర్లు కోనేటి రామకృష్ణ, బుల్లి దొర మాట్లాడుతూ, మెడికల్ కాలేజి పూర్తయితే అనకాపల్లి జిల్లాలో వైద్యరంగానికి కొత్త మలుపు ఉటుంటుందన్నారు.

కోటవురట్ల:మెడికల్ కళాశాలను ప్రైవేటు పరం చేయడం తగదు అంటూ శుక్రవారం మాజీ ఎమ్మెల్యే ఉమా శంకర్ గణేష్ అన్నారు. మాకవరపాలెం మెడికల్ సెంటర్ ను కార్యకర్తలతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పిపిపి పద్ధతి సరైనది కాదన్నారు. ఈ కార్యక్రమంలో నర్సీపట్నం, నాతవరం, గొలుగొండ మాకవరపాలెం మండలాలకు సంబంధించిన వైసీపీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



పంపిణీ చేస్తున్న నాయకులు

దోమ తెరల పంపిణీ

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని గాదంపాలెంలో శుక్రవారం వైద్య సిబ్బంది, టీడీపీ నాయకులు దోమ తెరలను పంపిణీ చేశారు. ప్రభుత్వం ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ దోమ తెరలను పంపిణీ చేస్తుందని టీడీపీ గ్రామ కమిటీ అధ్యక్షులు పోకనాటి త్రిమూర్తులు అన్నారు. ఈ దోమ తెరలను సద్వినియోగం చేసుకోవాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో విప్పలపాలెం ఆయకట్టు నీటి సంఘం మాజీ అధ్యక్షులు లగుడు నానిబాబు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బుజ్జి

రుణాలను వినియోగించుకోవాలి

ప్రజాశక్తి-నక్కపల్లి:సహకార బ్యాంకు రుణాలను వినియోగించుకోవాలని నక్కపల్లి పిఏసిఎస్ అధ్యక్షులు కొప్పిశెట్టి బుజ్జి కోరారు. మండలంలో ఉపమాక గ్రామంలో శుక్రవారం రైతుల వద్దకే సహకార బ్యాంకు అనే కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశం నిర్వహించారు. నక్కపల్లి పిఏసిఎస్ ద్వారా అందిస్తున్న రుణాలపై అవగాహన కల్పించారు. ఎకరానికి 5 లక్షల రూపాయలు, స్లాబు పూర్తయిన ఇంటి మీద 5 లక్షల రూపాయలు తక్కువ వడ్డీతో వాయిదాల పద్ధతిలో తిరిగి చెల్లించే అవకాశం తో రుణాలు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. అవసరమైన వారు బ్యాంకు ను సంప్రదించి రుణాలు పొందవచ్చునని అన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లు కోసూరి శీను, మనబాల కొండబాబు, గ్రామ సర్పంచ్ ప్రగడ వీరబాబు, బ్యాంకు సూపర్వైజర్ ప్రసాద్ సీఈవో శ్రీనివాస్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

అపారిశుధ్యంతో అవస్థలు పడుతున్నాం

విజయ్‌కు గోడు విన్నవించిన మహిళలు



సమస్యలు చెపుతున్న మహిళలు

ప్రజాశక్తి నర్సీపట్నం టౌన్ : తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చింతకాయల విజయ్ శుక్రవారం మున్సిపాలిటీ వార్డుల్లో పర్యటించారు. ఈ సందర్భంగా బీసీ కాలనీలోని చింతకాయల వరహాలదొర విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. బీసీ కాలనీలోని మహిళలు మాట్లాడుతూ, పారిశుధ్య సమస్యలతో ఇ బ్బందులు పడుతున్నామని విజయ్ దృష్టికి తీసుకెళ్లారు. చెత్తను తీసుకెళ్లడానికి మున్సిపాలిటీ ట్రాక్టర్ రాకపోవడంతో తీవ్ర సమస్యలు ఎదురవుతున్నాయని వారు తెలిపారు. సమస్య తెలుసుకున్న విజయ్ మున్సిపల్ శానిటరీ ఇన్స్పెక్టర్ చిట్టిబాబును పిలిపించి ట్రాక్టర్ ఎందుకు రాలేదని ప్రశ్నించారు. తప్పనిసరిగా ప్రతి వార్డులో చెత్త ట్రాక్టర్ రావాలని శానిటరీ ఇన్స్పెక్టర్ చిట్టిబాబు ను ఆదేశించారు. వర్షాలు ఎక్కువైనప్పుడు సాధారణ సమయాల్లో కూడా డ్రైనేజీ నీరు రోడ్లపైకి రావడంతో స్థానిక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని గుర్తించి, సచివాలయ సిబ్బందిపై విజయ్ ఆగ్రహం వ్యక్తం చేశారు.బీసీ కాలనీలో శిథిలావస్థలో ఉన్న హాస్టల్లో రాత్రిపూట అసాంఘిక చర్యలు జరుగుతున్నట్లు మహిళలు, స్థానికులు విజయ్ దృష్టికి తీసుకురావడంతో ఆయన వెంటనే పట్టణ సిఐకి ఫోన్ చేసి ప్రతిరోజూ పెట్రోలింగ్ వాహనంతో పాటు గస్తీ నిర్వహించాలని ఆదేశించార. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ ముఖ్యంగా పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి పెట్టామన్నారు. వార్డులలో లో-వోల్టేజ్ సమస్య ఎక్కువగా ఉంటుందని తన దృష్టికి తీసుకువచ్చారని, ఈ విషయంపై ఎలక్ట్రికల్ డిఇ, ఏఇ. ఏడిల తో చర్చించి సమస్య పరిష్కారం చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో 1, 2వ వార్డు ఇన్చార్జ్ లాలం మురళీ కృష్ణ, రావణాపల్లి రిజర్వాయర్ చైర్మన్ రుత్తల రాజేశ్వరరావు, శ్రీదుర్గామల్లేశ్వర ఆలయ సభ్యుడు శ్రీను, యువత పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు



బుచ్చయ్యపేటలో పరిశీలిస్తున్న డిప్యూటీ డైరెక్టర్

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట : పాడి రైతులు నాలుగు నెలలు నిండిన ప్రతి పశువుకు గాలి కుంట నివారణ టీకాలను వేయించాలని పశు సంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ బి చంద్రశేఖర్ సూచించారు. మండలంలోని కందిపూడి గ్రామంలో శుక్రవారం పశు వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పశు వులు పట్ల అప్రమత్తం గా ఉండాలన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ జి.శ్రీనివాసరావు, పశు వైద్యధికారి ఎస్.పద్మజ, సర్పంచ్ కొప్పాక గణేష్, రైతులు పాల్గొన్నారు.

రావికమతం:పశువులకు సోకే వ్యాధుల పట్ల రైతులు అప్రమత్తంగా ఉండాలని, ఎప్పటికప్పుడు పశువైద్యాధికారులను సంప్రదించాలని కొత్తకోట పశువైద్యాధికారిని బాల తేజ తెలిపారు. జాతీయ పశు వ్యాధి నివారణ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం పి. పోన్నవోలు సచివాలయ పరిధిలో గల జి.గదభపాలెం, చిన కుముందానిపేట, జి.చీడిపల్లి గ్రామాలలో పాడి పశువులకు గాలికుంటు వ్యాధి నివారణకు వైద్య శిబిరాలను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వైద్యాధికారిణి మాట్లాడుతూ, పాడి పశువులకు గాలి కుంటు సోకితే గర్భస్రావం, పేయ్యిల మరణాలు, పాల ఉత్పత్తిలో తగ్గుదల ఉంటుందన్నారు. ఈ వ్యాధి సోకిన పశువుల్లో అధిక జ్వరం, పాల ఉత్పత్తి తగ్గుదల, నోటి నుండి స్రావాలు, సరిగ్గా నడవలేకపోవడం, గిట్టల మధ్య, నోటి సిగుళ్ళ పైన పుండ్లు ఏర్పడటం వంటి లక్షణాలు కలిగి ఉంటాయన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని రైతులందరూ పశు వులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేయించుకోవాలని ఆమె కోరారు. ఈ కార్యక్రమంలో వెటర్నరీ అసిస్టెంట్ రావి ప్రసాద్, ఉప సర్పంచ్ ,రైతులు పలువురు పాల్గొన్నారు.



రావికమతంలో పరిశీలిస్తున్న వైద్యాధికారి

హెటిరో గొడౌన్‌లో తనిఖీలు


తనిఖీలు చేస్తున్న బృందం

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని వెదుళ్లపాలెం హైవేకు ఆనుకుని వున్న హెటెరోకు సంబంధించిన ఒక గొడౌన్, మరో అద్దె గృహాన్ని శుక్రవారం యుఎస్ ఎఫ్ఏ బృందం (డ్రగ్స్ విభాగం) ఉన్నతాధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ఈ బృందం నేరుగా ఢిల్లీ నుంచి ఇక్కడకు వచ్చింది. హెటెరో యాజమాన్యం ఎటువంటి నేమ్ బోర్డు లేకుండా ఉద్యోగులకు శిక్షణ ఇస్తున్నామంటూ ఒక గొడౌన్‌ను కొన్నేళ్ల కిందట నిర్మించింది. ఆ పక్కనే మరో ప్రైవేట్ భవనాన్ని కూడా అద్దె కు తీసుకుంది. యు ఎస్ కు చెందిన డ్రగ్స్ విభాగం అధికారి అక్తర్ నేతృత్వంలో బృందం తనిఖీలకు రావడంతో స్థానికంగా వున్న హెటెరో ప్రతినిధుల సూచనల మేరకు అక్కడ ఉన్న సిబ్బంది పంట పొలాల్లోకి పరుగులు తీశారు. హెటెరో గొడౌన్ను, అద్దె భవనాన్ని ఈ బృందం అనువణువూ పరిశీలించింది. కొన్ని రసాయనక వ్యర్థాలు, వ్యాక్సిన్లకు సంబంధించినవి లభించాయి. అదేవిధంగా కొన్ని ఫైళ్లు, పత్రాలు కూడా అట్ట పెట్టెల్లో లభించాయి. వాటన్నింటినీ ఈ బృందం పరిశీలించింది. మీడియా వారిని మాత్రం లోపలకి అనుమతించ లేదు. ఇటీవల కాగిత ఎంపీటీసీ సభ్యులు ఆకేటి గోవిందరావు కూడా రాష్ట్ర ప్రభుత్వానికి హెటెరో కొత్తగా నిర్మిస్తున్న గ్యాస్ గొడౌన్ నిలిపి వేయాలంటూ హెూం మంత్రి వంగలపూడి అనిత ,సహా అనేక మంది అధికారులకు ఫిర్యాదు చేశారు.ఈ సమయంలో డ్రగ్స్ విభాగం ఉన్నతాధికారులు, యుఎస్ బృందం జరిపిన దాడులు చర్చనీయమయ్యాయి. తనిఖీలకు సంబంధించిన వివరాలు అధికారులు వెల్లడించలేదు.


రికార్డులు పరిశీలిస్తున్న వరహాలదొర

సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించాలి

-జిల్లా మలేరియా అధికారి వరహాలదొర

ప్రజాశక్తి-గొలుగొండ:గొలుగొండ మండలం కృష్ణదేవిపేట పీహెచ్ సీని శుక్రవారం జిల్లా మలేరియా అధికారి కే.వరహాలదొర, సహాయ మలేరియా అధికారి ఏజే.సత్యనారాయణ సందర్శించారు. ఈ సందర్భంగా ల్యాబ్ రికార్డులు, రోజు వారీ మలేరియా రక్త పరీక్షలు తనిఖీ చేశారు. అనంతరం పాతకృష్ణదేవిపేట, సీహెచ్.నాగాపురం గ్రామాలను సందర్శించ అక్కడ సిబ్బంది పనితీరు, ఫీవర్ సర్వేను పరిశీలించారు. అనంతరం సీజనల్ వ్యాధులకు రాకుండా ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డ్రైడే, ఫ్రైడేలో ఇంటింటి సందర్శన చేసి ఇంటి చుట్టు ఉన్న నీటి నిల్వలు లేకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. దోమతెరలు వాడటం, దోమల మందు పిచికారీ చేయుట ద్వారా దోమలను అరికట్టవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి గాయత్రి, సిబ్బంది పాల్గొన్నారు.


సెలక్షన్స్ ప్రారంభిస్తున్న ఎంఇఒ

జిల్లా స్థాయి పోటీలకు సెలక్షన్స్

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలోని చోద్యం హైస్కూల్లో శుక్రవారం అండర్ -17 జిల్లా స్థాయి బాల బాలికల సెపక్ తక్రా సెలక్షన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈవో- 2 కృష్ణప్రసాద్ మాట్లాడుతూ, ప్రాచీన ఆట పేరొందిన ఈ సెపక్ తక్రా ఆట, ఏదైనా ఇప్పుడిప్పుడే మన దేశంలో ఆదరణ పొందుతుందన్నారు. వేరే దేశంలో ప్రచుర్యంలో ఉన్న ఈ ఆట ఇండియాలో కూడా ఆదరణ పొందుతుందని తెలిపారు. జిల్లా స్థాయిలో సెలక్ట్ ప్లేయర్స్, రాష్ట్ర స్థాయిలో నిర్వహించే పోటిల్లో పాల్గొంటారన్నారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసరావు, ఎస్జీఎఫ్ అడ్మినిస్ట్రేషన్ కార్యదర్శి అచ్చియ్యమ్మ, ఎస్జిఎఫ్ అబ్జర్వర్స్ రాజు, నూకరాజు, డివిజన్ కొ ఆర్డినేటర్ టీవి.రమణ, స్కూల్ కమిటీ చైర్మన్ సత్తిబాబు, రిటైర్డ్ వ్యాయమ ఉపాధ్యాయులు ప్రభాకర్ పాల్గొన్నారు

ఎంపిడిఒకు అభినందనలు

ప్రజాశక్తి - కొత్తకోట:ఇటీవల రావికమతం మండల పరిషత్ ఎంపీడీవో గా బాధ్యతలు చేపట్టిన మహేష్ ను మండల పరిషత్ కార్యాలయం లో శుక్రవారం ప్రోటోకాల్ జెడ్పిటిసి తలారి ఆదిమూర్తి, డిసిసిబి మాజీ డైరెక్టర్ గుమ్ముడు సత్యదేవ్, కొత్తకోట గ్రామ సర్పంచ్ కోన లోవరాజు, మండల వైఎస్ఆర్సిపి ప్రధాన కార్యదర్శి శీలం శంకర్రావు, కొత్తకోట-1 ఎంపీటీసీ కుంచా లక్ష్మీ శంకర్రావు తదితరులు మర్యాద పూర్వకం గా కలసి అభినందన లు తెలిపారు.ఈ సందర్భంగా మండల అభివృద్ధికి ఎం పి డి వో కృషి చేయాలని కోరారు. పలు సమస్య లపై వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పైలరాజు, ఎంపీటీసీల ఫ్లోర్ లీడర్ పూడి దేవ తదితరులు పాల్గొన్నారు...

వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

ప్రజాశక్తి- నక్కపల్లి:వరిలో సస్యరక్షణ చర్యలు చేపట్టాలని వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ రైతులకు సూచించారు. మండలంలో శుక్రవారం గొడిచెర్ల, ఒడ్డిమెట్ట, దేవవరం గ్రామాల్లో క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సిబ్బందితో కలిసి వరి పొలాలను పరిశీలించారు. వరిలో ఆకు ముడత తెగులు సోకడంతో నివారణ చర్యలు గురించి వివరించారు.

దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలి

-గొర్రెలు, మేకల పెంపకందారుల నిరసన

ప్రజాశక్తి -మాడుగుల:మండలంలో ఎం. కృష్ణా పురం గ్రామంలో గొర్రెల పెంపకందారుల కుటుంబానికి చెందిన కోళ్ల వరహాలనాయుడు పై దాడి చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ మాడుగులు తహసిల్దార్ కార్యాలయం వద్ద ఆంధ్రప్రదేశ్ గొర్రెల మేకల పెంపకం దారులు సంఘం జిల్లా కార్యదర్శి గోకాడ దేవుడు నాయుడు అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. అనంతరం తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ, ఎం.కృష్ణాపురం గ్రామంలో గొర్రెల పెంపకందారుల కుటుంబానికి చెందిన కోళ్ల వరహాలనాయుడుని అదే గ్రామానికి చెందిన నీటిపల్లి నాయుడు, నీటిపల్లి రాజారావులు ఈ నెల 11 తేదీ గురువారం అతి దారుణంగా కిరాతకంగా కర్రతో కొట్టారన్నారు. వారిపై చట్టరీత్యా తగు చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బిసి కార్పొరేషన్ సబ్సిడీతో ఆంధ్రప్రదేశ్ గొర్రెల మేకల అభివృద్ధి సహాకార ఫెడరేషన్ ఋణంతో జాయింట్‌గా 2,20,000 రూపాయ లతో ఋణాలు ఇవ్వాలన్నారు. ఎన్‌సిడిసి రుణాలు విడుదల చేసి ఖర్చు చేయాలన్నారు. మూడో విడత 120 కోట్లు రూపాయాలు నిధులు వచ్చే విధంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగు చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం వైస్ చైర్మన్ పెద్ద శ్రీనివాసరావు, జిల్లా అధ్యక్షులు ఉరిగిటి శివ సూర్యనారాయణ, కోన నాగేశ్వరరావు, ఏదిర అప్పారావు, మాజీ సర్పంచ్ మొల్లి అప్పారావు, చందక తాతారావు, బాలిబోయిన నారాయణరావు, పాతరపల్లి పెంటయ్య, యలమంచిలి రమణ, బర్ల నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



ధర్నా చేపడుతున్న సంఘం నాయకులు

యుద్ధ ప్రాతిపదికన రోడ్ల మరమ్మతులు చేయాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి కోటేశ్వరరావు

ప్రజాశక్తి-అనకాపల్లి : జిల్లాలో ప్రధాన రహదాలన్నీ ఛిద్రంగా వున్నాయని, యుద్ధ ప్రాతిపదికన రోడ్లు మరమ్మతులు పూర్తి చేయాలని సిపిఎం అనకాపల్లి జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లా పరిధిలో వున్న 1100 కిలోమీటర్ల ఆర్ అండ్ బి రోడ్లు అధ్వానంగా ఉన్నాయని పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చిలో రూ.8.8 కోట్లుతో 521 కిలోమీటర్ల రోడ్లకు మరమ్మతులు చేసినా, ఇటీవల కురిసిన వర్షాలతో మళ్లీ గుంతలు, గొయ్యిలు ఏర్పడి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోందని తెలిపారు. గ్రామీణ ప్రాంతంలో కొత్తగా వేసిన 229 కిలోమీటర్ల రోడ్లు కూడా కొద్ది కాలంలోనే ఛిద్రమయ్యాయంటే ఎంత నాణ్యతగా పనులు చేశారో అర్థమౌతుందన్నారు. అనకాపల్లి-చోడవరం, భీమునిపట్నం -నర్సీపట్నం (బిఎన్), అడ్డురోడ్డు-నర్సీపట్నం, గంధవరం-రోలుగుంట, వడ్డాది-పాడేరు, సబ్బవరం -పరవాడ రోడ్లు పూర్తిగా గోతులు పడి ప్రయాణం నరకప్రాయంగా ఉంటుందన ఆవేదన వ్యక్తం చేశారు. బుచ్చయ్యపేట మండలంలోని తాచేరు నదిపై వంతెన కూలిపోవడం, తాత్కాలికంగా వేసిన కాజ్‌వే వర్షాలకు కొట్టుకుపోవడంతో ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయాయని పేర్కొన్నారు. బిఎన్ రోడ్డులో గోతుల్లో వాహనాలు కూరుకుపోయి రోడ్డు మధ్యలో ఆగిపోతున్నాయన్నారు. రోడ్ల దుస్థితి ఇలా ఉండడం వల్ల అత్యవసర వైద్య సేవలు సమయానికి అందని పరిస్థితి నెలకొందని ఆవేదన వ్యక్తం చేశారు. నాన్ షెడ్యూల్ గిరిజన గ్రామాలకు రోడ్లు లేక పదుల కిలోమీటర్లు నడుచుకుంటూ వెళ్తున్నారని, అత్యవసర సమయాల్లో డోలి మోతలు తప్పడం లేదని, ఆయా గ్రామాలకు కనక్టవిటీ రోడ్లు వేయాలని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే రోడ్ల మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తామని ఇచ్చిన హామీ నేటికి అమలకు నోచుకోలేదని, ఇప్పటికైనా గ్రామీణ మండలాలను కలిపే ప్రధాన రహదారులకు ప్రాధాన్యతనిస్తూ శాశ్వతంగా రోడ్లు నిర్మాణాలు చేపట్టాలని కోటేశ్వరరావు డిమాండ్ చేశారు.

ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి చర్యలు

జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్

ప్రజాశక్తి-అనకాపల్లి : ఉద్యోగుల వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ అధికారులను ఆదేశించారు. కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో ప్రభుత్వ ఉద్యోగుల ప్రత్యేక గ్రీవెన్స్ శుక్రవారం నిర్వహించారు. జిల్లా కలెక్టరు విజయ కృష్ణన్ ఉద్యోగుల నుండి అర్జీలు స్వీకరించారు. ప్రతి ఒక్కరి సమస్యను కలెక్టరు అడిగి తెలుసుకున్నారు. న్యాయమైన, పరిష్కరించుటకు అవకాశం గల సమస్యలను వెంటనే పరిష్కరించాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. 13 మంది ఉద్యోగులు వారి సమస్యలపై అర్జీల రూపంలో తెలియజేశారు. కార్యక్రమంలో కెఆర్‌సి స్పెషల్ డిప్యూటీ కలెక్టరు, పిజిఆర్ఎస్ నోడల్ అధికారి సుబ్బలక్ష్మి, కలెక్టరు కార్యాలయ పరిపాలనాధికారి విజయ్ కుమార్, పిజిఆర్ఎస్ సెల్ సూపరింటెండెంటు సురేష్ నాయుడు పాల్గొన్నారు.


ఉద్యోగుల సమస్యలు వింటున్న కలెక్టర్ విజయ కృష్ణన్

22 నుండి సబ్ స్టేషన్‌లో లైన్ క్లియర్ పనులు

ప్రజాశక్తి-పరవాడ

గాజువాక ఓఅండ్ఎం డివిజన్ ఆధ్వర్యంలో పరవాడ 220 కెవి సబ్‌స్టేషన్‌లో లైన్‌క్లియర్ పనులు ఈ నెల 22 నుండి చేపట్టనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. గాజువాక ఓఅండ్ఎం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ ఆదేశాలు మేరకు సెప్టెంబర్ 22, 23, 26 తేదీల్లో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 220 కెవి పరవాడ-1 ఫీడర్‌పైనా, సెప్టెంబర్ 24, 25, 27 తేదీల్లో ఉదయం 6 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు 220 కెవి పరవాడ-2 ఫీడర్‌పై పనులు జరుగుతాయని వెల్లడించారు. ఈ సమయంలో 220 కెవి పరవాడ సబ్‌స్టేషన్‌లో 800 యాంప్స్ సామర్థ్యం కలిగిన బస్, లైన్ ఐసొలేటర్లను 1600 యాంప్స్ సామర్థ్యం గల వాటితో భర్తీ చేయనున్నారు. పనుల కారణంగా 220 కెవి పరవాడ-కాకినాడ, 220 కెవి పరవాడ- అన్రాక్ ఫీడర్లు మాన్యువల్‌గా ట్రిప్ చేయబడతాయని తెలిపారు. లైన్ క్లియర్ సమయంలో పరవాడ సబ్‌స్టేషన్‌కు కేవలం ఒక ఇన్‌కమింగ్ సోర్స్ మాత్రమే అందుబాటులో ఉంటుందని అధికారులు వెల్లడించారు. అందువల్ల అత్యవసర పరిస్థితుల్లో 33 కెవి లోడ్లకు ప్రత్యామ్నాయ సరఫరా/లోడ్ రిలీఫ్ కల్పించాలని సూచించారు.